## గవర్నర్‌ను కలిసిన సీఎం



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 12 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:195 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## ఆ వాడి పాడేసిన బ్యాగు రూ.85 కోట్లు



వేలంలో వెర్రిబ్యాగులోళ్ల సొంతమైన సెలబ్రిటీ హ్యాండ్‌బ్యాగ్ 2

# ప్రజల సహకారంతోనే మెగా పీటీఎం 2.0 సరికొత్త చరిత్ర



ఏపీ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన మెగా పీటీఎం 2.0ను విజయవంతం చేసిన ప్రజలందరికీ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యా శాఖ, సమగ్ర శిక్షా అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజల సహకారంతోనే మెగా పీటీఎం 2.0 సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. స్వచ్ఛందంగా సమాజం అందించిన ఈ సహకారం విద్యా వ్యవస్థ వికాసానికి ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రకృతి వ్యవసాయం మెరుగైన దిగుబడి, మాతృభూమికి రక్షణ



**విశాఖపట్నం, జూలై 11 (మనం న్యూస్):** గ్రామీణ భారతదేశాన్ని పరివర్తన చెందించే విషయానికి వస్తే, కేవలం పథకాలు మాత్రమే సరిపోవు. ఒక దార్శనికత, ఒక దిశ మరియు దీర్ఘకాలిక దృక్పథం అవసరం. ఈ దార్శనికత ఇప్పుడు భారతదేశ సహకార ఉద్యమం మరియు వ్యవసాయ సంస్కరణలలో స్పష్టంగా కనిపిస్తుంది. సహకార రంగంలో కొత్త శక్తి తరంగం ఊపందుకుంది. గ్రామీణ భారతదేశ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం మరియు స్వావలంబన గురించి చర్చించినప్పుడల్లా, సహకారం అనే భావన సహజంగానే గుర్తుకు వస్తుంది. అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా అహ్మదాబాద్లో ఇటీవల జరిగిన 'సహకార్ సంవాద్' కార్యక్రమంలో, సహకార సంస్థలతో సంబంధం ఉన్న

...మిగతా 2లో



## ముఖ్యమంత్రిని తన ఇంట వివాహానికి ఆహ్వానించిన రాజు యాదవ్

**అమరావతి/తిరుమల, జూలై 11(మనం న్యూస్):** తెలుగుదేశం పార్టీ తిరుమల అధ్యక్షులు సుద్దాల రాజు యాదవ్ ప్రథమ కుమారుడు భరత్ యాదవ్కు ఈ నెల జూలై 31వ తారీఖున జరగనున్న వివాహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ గారిని అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెల జూలై 31వ తారీఖు గురువారం రోజున తిరుపతిలోని ఏ కన్వెన్షన్ కల్యాణ వేదిక లో నిర్వహించనున్న వివాహ కార్యక్రమానికి హాజరు అయి నూతన వధూవరులను ఆశీర్వదించ వలసిందిగా ప్రత్యేకంగా తయారుచేసిన వివాహ ఆహ్వాన పత్రికను వారి అందజేశారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బడి సుధా యాదవ్ కూడ ఉన్నారు.

# కర్నూలు ఎంతో అభివృద్ధి చెందుతుంది

## రాష్ట్ర మంత్రి టి.జి భరత్

**కర్నూలు, జూలై 11(మనం న్యూస్):** రానున్న రోజుల్లో కర్నూలు ఎంతో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసేఫ్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన మై సిటీ-మై రోల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ను ఏర్పాటుచేస్తుందన్నారు. కర్నూలు విద్యార్థులు అనంతపురంలో ఏర్పాటుచేసే ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వం అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికనోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలు వచ్చి రానున్న రోజుల్లో కర్నూలు ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక ప్రజలు నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదన్నారు. పార్కింగ్, ఆక్రమణల విషయంలో విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.



# టీటీడీలో అన్యమతస్తులకు ఉద్యోగాలెలా ఇస్తారు?

**టీటీడీలో వెయ్యి మంది అన్యమతస్తులు ఉద్యోగాలు చేస్తుంటే ఏం చేస్తున్నారు ?**

మసీదు, చర్చిల్లో హిందువులకు ఉద్యోగాలిస్తారా ? • ప్రభుత్వాలు, పాలకులు మారినా వాళ్లను ఇంకా కొనసాగించడమేంటి ? • తక్షణమే వాళ్లను తొలగించాలి • ధూపదీప నైవేద్యాలకు నోచుకుని ఆలయాలను, పురాతన దేవాలయాలను టీటీడీ ఆదుకోవాలి • కరీంనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని వెంటనే నిర్మించాలి • ఇల్లందకుంట రామాలయం, కొండగట్టు అంజన్న ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి • కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ • కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్

**తిరుమల,జూలై 11,మనం న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానంలో వెయ్యి మందికిపైగా అన్యమతస్తులకు ఏ విధంగా ఉద్యోగాలిచ్చారని తక్షణమే వాళ్లను ఉద్యోగాల నుండి తొలగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మసీదులు, చర్చిల్లో హిందువులకు ఉద్యోగాలు ఇస్తారా అని ప్రశ్నించారు. తిరుమల హిందువుల ఆస్తి అన్యమతస్తులను తప్పించడంలో ఇక్కడ ఓటు బ్యాంకు రాజకీయాలు చెయ్యడం సరైందికాదని ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ అనవాయితీని ఎందుకు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చిన బండి సంజయ్ కుమార్ శుక్రవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం ఆలయం లోని రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి



తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని. ప్రశాంత వాతావరణంలో జీవించాలని. ఈ దేశం కోసం, సనాతన ధర్మ రక్షణ కోసం కలిసికట్టుగా ఉంటూ చేదోడు వాదోడుగా ఉండాలంటూ. శక్తివంతమైన భారత్ నిర్మాణం కోసం, దేశాభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్న ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించేలా శక్తి సామర్థ్యాలు కల్పించాలని స్వామి వారిని ప్రార్థించానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో కనీసం ధూపదీప నైవేద్యాలకు నోచుకోని దేవాలయాలను,

...మిగతా 2లో

## టార్గెట్ మోడీ???

ఆవ్యాఖ్యలు మోడీ గురించే.. నా?

75 ఏండ్ల వయసొచ్చాక రిటైర్మెంట్ తీసుకోవాలన్న మోహన్ భాగవత్ కామెంట్‌పై కాంగ్రెస్ పోస్ట్



**ఢిల్లీ, జూలై 11:** 75 ఏండ్ల వయసొచ్చాక రిటైర్మెంట్ తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశాలైనాయి. ప్రధాని మోడీని ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ స్పందించింది. ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. మరాఠా సామ్రాజ్య మొదటి

...మిగతా 2లో

# హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు



## డిప్యూటీ సీఎం పవన్

**హైదరాబాద్:** విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం భాషతో సంబంధం లేకుండా ముందుకెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయే తరాల అభివద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకలకు పవన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ''హిందీలో డబ్ అయిన 31 శాతం సౌత్ ఇండియన్ సినిమాలు ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. వ్యాపారానికి హిందీ కావాలి కానీ, నేర్చుకోవడానికి ఎందుకు ఇబ్బంది. హిందీ నేర్చుకోవడమంటే మన ఉనికిని కోల్పోవడం కాదు. ఇంకో భాషను అంగీకరించడమంటే ఓడిపోవడం కాదు.. కలిసి ప్రయాణించడం'' అని పవన్ కల్యాణ్ అన్నారు. వేడుకల్లో భాగంగా దక్షిణ సంవాదం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

**అమరావతి:** కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలపై ఇలాంటి చర్యలకు దిగుతున్న వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యార్థినులకు లైంగిక వేధింపుల ఘటనలో బాధ్యులను సస్పెండ్ చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు.

# త్వరలోనే డాలర్‌కు ఆల్టర్నేటివ్?

## అమెరికా అహంకారపూరిత ధోరణే కారణం

### ట్రంప్ బెదిరిస్తున్న కొద్దీ అగ్రరాజ్య కరెన్సీకి మూడుతుంది

### జీటీఆర్ఐ అధ్యయనం వెల్లడి

**వాషింగ్టన్, జూలై 11:** ప్రత్యర్థి దేశాలను బెదిరించేందుకు అమెరికా చేపట్టే ఆర్థిక చర్యలే.. అగ్రరాజ్యం ఆర్థికంగా తన గోతిని తనే తవ్వుకుంటున్నట్టుగా తయారైంది. దాని ఆర్థిక బెదిరింపులు ప్రపంచాన్ని డాలర్ ప్రత్యామ్నాయం వైపు నెట్టేస్తున్నట్టు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటీవ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా అంతర్జాతీయ పేమెంట్స్ వ్యవస్థ స్విఫ్టును ఉపయోగించకుండా నిషేధానికి గురైన రష్యా, ఇరాన్, వెనుజువెలా వంటి దేశాలు డాలర్లలో చెల్లింపుల స్వీకరణను నిలిపేసేలా

...మిగతా 2లో



## వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చాం: మంత్రి నిమ్మల

**పాలకొల్లు:** వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చామని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కష్టపడి పండించిన పంట విలువ జగన్‌కు ఏం తెలుసు?అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తున్నామన్నారు.



# తమ పది నిమిషాల డెలివరీ సేవను ప్రారంభించిన బిగ్‌బాస్కెట్

కర్నూలు/కాకినాడ, 11 జూలై(మనంన్యూస్): టాటా వ్యాపార విభాగం అయిన బిగ్బాస్కెట్ , దాని త్వరిత డెలివరీ సేవలను కర్నూలు, కాకినాడలలో ప్రారంభించింది. ఇది కర్నూలు, కాకినాడ నగరాల షాపింగ్ అనుభవంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. కర్నూలు, కాకినాడ వాసులకు తాజా ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ , వ్యక్తిగత సంరక్షణ, నిత్యావసరాలు సహా 10,000 కంటే ఎక్కువ ఉత్పత్తుల యొక్క విభిన్న శ్రేణి నుంచి ఎంచుకునే అవకాశాన్ని బిగ్‌బాస్కెట్ అందిస్తుంది, ఇవన్నీ ఆకట్టుకునే రీతిలో 10 నిమిషాల్లో డెలివరీ చేయబడతాయి. సౌకర్యాన్ని పునర్నిర్వచించటానికి, వినియోగదారులు అపూర్వమైన వేగంతో తమ ఇళ్ల నుండి కిరాణా సామాగ్రిని కొనుగోలు చేయడానికి వీలు కల్పించే రీతిలో ఈ సేవను రూపొందించడం జరిగింది. వేగవంతమైన పట్టణ కేంద్రంగా కర్నూలు అభివృద్ధి చెందుతున్నందున, ఇక్కడి నివాసితులు మరింత సౌకర్యవంతమైన, సమర్థవంతమైన షాపింగ్ పరిష్కారాలను కోరుకుంటున్నారు. వేగం, సౌలభ్యం , విశ్వసనీయత కోసం నగరంలో పెరుగుతున్న డిమాండ్, బిగ్‌బాస్కెట్ 10-నిమిషాల డెలివరీ సేవకు అనువైన వేదికగా నిలిచింది. జీవనశైలి మరింత బిజీగా మారుతున్నందున, డిజిటల్ స్వీకరణ పెరుగుతున్నందున, ఈ సేవల ప్రారంభం కర్నూలు యొక్క మారుతున్న వినియోగదారుల అలవాట్లు మరియు పెరుగుతున్న అంచనాలకు సరిగ్గా సరిపోతుంది. బిగ్ బాస్కెట్ నేషనల్ బిజినెస్ హెడ్ - టైర్ 2, శ్రీ శశి శేఖర్ మాట్లాడుతూ,




'కర్నూలుకు బిగ్బాస్కెట్ ను పరిచయం చేయడానికి మేము సంతోషిస్తున్నామని, ఇటీవలి విస్తరణలు గణనీయమైన రీతిలో సానుకూల స్పందనను చూపించాయి. కర్నూలు నివాసితులు 10 నిమిషాల డెలివరీల సౌకర్యం నుండి ప్రయోజనం పొందుతారని విశ్వసిస్తున్నాము. నేటి వేగవంతమైన జీవనశైలి యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం ద్వారా కస్టమర్ సంతృప్తిని పెంచడంలో మా అంకితభావాన్ని ఈ సేవ నొక్కి చెబుతుంది' అని అన్నారు. 10-నిమిషాల డెలివరీ సేవ పరిచయంతో, బిగ్‌బాస్కెట్ కర్నూలు, కాకినాడలలో తన కార్యకలాపాలను విస్తృతం చేస్తూ, వేగవంతమైన, నమ్మదగిన , వైవిధ్యమైన డెలివరీ సేవలను అందిస్తోంది. ఈ చర్య ఈ ప్రాంతంలో గణనీయమైన వృద్ధిని పెంచుతుందని, కర్నూలు వాసులకు సౌకర్యం పరంగా కొత్త యుగానికి నాంది పలుకుతుందని భావిస్తున్నారు.

# ఆ వాడి పాడేసిన బ్యాగు... రూ.85 కోట్లు

- **వేలంలో వెర్రిబ్యాగులోళ్ల సొంతమైన సెలబ్రిటీ హ్యాండ్‌బ్యాగ్**

**ప్యారిస్, జూలై 11:** స్వర్గీయ నటి, గాయని జానే బర్కిన్ వాడి పాడేసిన బ్యాగు వేలంలో రూ. 85 కోట్ల ధర పలికింది. ఫ్రాన్స్ లగ్జరీ బ్రాండ్ హర్మీస్ ఒక అరుదైన బ్యాగ్‌ను తయారుచేసి అందజేసింది. ఆ బ్యాగును ఇప్పుడు పారిస్‌లోని సోథిబే ఆక్షన్ హౌస్ నిర్వహించిన వేలంలో జపాన్ కు చెందిన ఓ ప్రైవేటు కలెక్టర్ 8.58 మిలియన్ యూరో(భారత కరెన్సీలో దాదాపు రూ.85 కోట్ల)కు సొంతం చేసుకున్నాడు. 1980లో నటి జానే బర్కిన్ ఓసారి పారిస్ నుంచి లండన్ వెళ్తుండగా విమానంలో ఆమె పక్క సీట్లో హర్మీస్ అప్పటి యజమాని జీన్ లూయిస్ కూర్చున్నారు. ఓ బిడ్డకు తల్లిగా తనకు కావాల్సిన రీతిలో మంచి బ్యాగు దొరకడం లేదని ఈ సందర్భంగా ఆమె ఆయనతో చెప్పారు. దాంతో 1984లో హర్మీస్ సంస్థ.. చంటిపిల్లలు, ఎడపిల్లలను వెంట తీసుకుని వెళ్లే తల్లులకోసం ప్రత్యేకమైన బ్యాగును రూపొందించి నటికి అందించింది. దానికి 'బర్కిన్ బ్రాండ్' అని పేరు పెట్టింది. బ్యాగు పైన జె.బి. అనే అక్షరాలు.. లోపల లోహంతో చేసిన రింగులు, భుజం నుంచి జారిపోకుండా ఉండేలా స్ట్రాప్, నెయిల్ క్లిప్పర్ వంటివి ఉంచారు. కొన్నేళ్ల పాటు దాన్ని వాడిన బర్కిన్ ఆ తర్వాత హర్మీస్ కంపెనీకి ఇచ్చేశారు. కంపెనీ యాజమాన్యం 1994లో దాన్ని వేలం వేసి వచ్చిన డబ్బును ఎయిడ్స్ ఛారిటీకి అందజేశారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పారిస్కు చెందిన కేథరీన్ బెనియర్ అనే మహిళ వేలంలో దాన్ని సొంతం చేసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు సోథిబే సంస్థ ఈ బ్యాగ్కు వేలం నిర్వహించింది. ఒక హ్యాండ్ బ్యాగు ఇంత ఎక్కువ ధర పలకడం చరిత్రలో ఇదే తొలిసారి. అంతకుముందు 2021లో హాంకాంగ్లో నిర్వహించిన ఓ వేలంలో మొసలి చర్మంతో చేసిన వజ్రాలు పొదిగిన ఓ బ్యాగు 5,13,000 డాలర్లకు అమ్ముడైంది. దానికన్నా ఎక్కువ ధర పలికింది ఈ బర్కిన్ బ్యాగే కావడం గమనార్హం. హర్మీస్ సంస్థ ఇదే డిజైన్లో కొంచెం చిన్న సైజులో అనేక బర్కిన్ బ్యాగులను తయారుచేస్తూ వస్తోంది. లిమిటెడ్ ఎడిషన్లో వచ్చే ఈ బ్యాగులను జెన్నిఫర్ లోపేజ్, విక్టోరియా బెక్హామ్ వంటి ప్రముఖులు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్యాగుల ప్రారంభ ధర మార్కెట్లో 10వేల డాలర్లుగా ఉంది.

# టార్గెట్ మోడీ???

(మొదటి పేజీ తరువాయి)

పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. '75 ఏండ్ల శాలువా మన మీద కప్పారంటే.. మనం ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం పక్కకు జరిగి.. వేరే వాళ్లు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి'' అని పింగ్లే వ్యాఖ్యలను భాగవత్ గుర్తుచేశారు. ఇవి నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి. సెప్టెంబరుతో ప్రధాని మోడీకి 75 ఏండ్లు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. 'పలు అవార్డులు తీసుకొని, విదేశీ పర్యటనలు ముగించుకుని వస్తున్న ప్రధాని మోడీకి ఎలాంటి స్వాగతం లభించిందో చూడండి.. ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి ఆయనకు 75 ఏండ్లు పూర్తవుతాయనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ గుర్తుచేస్తున్నారు. కానీ, భాగవత్ కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోడీ గుర్తు చేయాలి'' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ పోస్ట్ పెట్టారు. 'ఒక్క దెబ్బకు.. రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు.ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోడీ నాగ్‌పూర్ లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే మోడీ రిటైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత 10, 11 ఏండ్లలో మోడీ ఎన్నడూ ఈ కార్యాలయానికి రాలేదు. దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోడీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సంఘ్ భావిస్తోంది' అన్నాడు. ఇప్పుడు భాగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

# బ్లాక్ లిస్టులోకి లూజ్ ఫాస్టాగ్‌లు

**ఢిల్లీ, జూలై 11:** జాతీయ రహదారులపై ప్రయాణ విషయంలో టోల్ పాస్‌ను తీసుకొస్తోన్న కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'లూజ్ ఫాస్టాగ్ యూజర్లను ఇకపై బ్లాక్ లిస్టులో వేస్తామంటూ జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రకటించింది. వాహనదారులు తమ ఫాస్టాగ్ లను వాహన విండ్ షీల్డ్‌పై అతికించాలి. టోల్ ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ, కొందరు ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్లను అతికించట్లేదు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే 'లూజ్ ఫాస్టాగ్'గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని రహదారుల సంస్థ తెలిపింది. అంతేగాక, కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని తెలపింది. వీటి కట్టడిలో భాగంగానే లూజ్ ఫాసాగ్ యూజర్లను బ్లాక్ లస్టులో చేర్చనున్నట్లు వెల్లడించింది.




# ప్రకృతి వ్యవసాయం మెరుగైన దిగుబడి, మాతృభూమికి రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు మరియు అట్టడుగు స్థాయి కార్మికులు తమ విజయాలను అద్భుతమైన విశ్వాసంతో పంచుకున్నారు, మార్పు యొక్క గాలులు కాగితంపై మాత్రమే కాకుండా, భూమిపై కూడా వేళ్ళూనుకుంటున్నాయని ప్రతిబింబించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్రామీణ శ్రేయస్సుకు మార్గం మన గ్రామాల సమిష్టి బలంలో ఉందని నొక్కిచెప్పి అంకితమైన సహకార మంత్రిత్వ శాఖను సృష్టించినప్పుడు ఈ పరివర్తనకు బీజం పడింది. కానీ ఈ విత్తనాన్ని పెంపొందించిన ఘనత కేంద్ర హోంమంత్రి మరియు సహకార మంత్రి అమిత్ షాకే దక్కుతుంది - ఆయన సాంప్రదాయ విలువలలో పాతుకుపోయి, ఈ ఉద్యమాన్ని జాతీయ చర్చగా పెంచారు.

అంత్యోదయ (చివరి వ్యక్తి యొక్క ఉద్ధరణ) తత్వశాస్త్రం నుండి ప్రేరణ పొందిన షా, సహకార ఉద్యమంతో అనుబంధం కొత్తది కాదు. ఈ రంగంపై ఆయనకున్న లోతైన అవగాహన కారణంగా, ఆయన 2001లో బిజెపి సహకార సెల్ జాతీయ సమన్వయకర్తగా నియమితులయ్యారు.

సహకార సంస్థల పట్ల షా దృష్టి కేవలం రాజకీయపరమైనది కాదు, ఆచరణాత్మకమైనది మరియు లోతైన సానుభూతితో కూడుకున్నది. అహ్మదాబాద్ జిల్లా సహకార బ్యాంకు మరియు మాధవపుర బ్యాంకు వంటి రెండు పనిచేయని సంస్థలను పునరుద్ధరించడం సాధారణ ఘనత కాదు. షా కేవలం మాటల మనిషి కాదని, పరిష్కారాల మనిషి అని ఇది నిరూపించింది. ఇప్పుడు, కేంద్ర సహకార మంత్రిగా, జాతీయ అభివృద్ధి ఎజెండాలో సహకార సంస్థలను కేంద్రంగా ఉంచిన చట్టాన్ని ఆయన పార్లమెంటులో త్వరగా ప్రవేశపెట్టారు.

ఈరోజు, సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, సహజ వ్యవసాయం, పాడి విప్లవం, మహిళా సాధికారత మరియు డిజిటల్ ౖఅఇఖ (ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలు) వంటి విభిన్న కార్యక్రమాలు సహకార చట్రంలో విలీనం చేయబడ్డాయి.

సహజ వ్యవసాయం గురించి అమిత్ షా మాట్లాడేటప్పుడు, అది పర్యావరణ ఆందోళనలకు మించి, భారతదేశ సాంస్కృతిక స్పృహతో ప్రతిధ్వనిస్తుంది. రసాయన వ్యవసాయం నేలను దెబ్బతీయడమే కాకుండా రైతు స్వావలంబనను కూడా దెబ్బతీసిందని ఆయన నమ్ముతున్నారు. రసాయనాల వాడకం వల్ల క్షీణించిన నేల సహజ పద్ధతుల ద్వారా పునరుద్ధరించబడినప్పుడు, రైతు మెరుగైన దిగుబడిని పొందడమే కాకుండా, పునరుద్ధరించబడిన గౌరవాన్ని పొందుతాడు. ఒక వైపు, సహజ వ్యవసాయం అధిక ఉత్పాదకతను నిర్ధారిస్తుంది; మరోవైపు, ఇది నేలను కాపాడుతుంది. సహజ వ్యవసాయం కేవలం ప్రత్యామ్నాయం కాదు, అది ముందుకు సాగే మార్గం.

'సహకార్ సంవాద్'లో జరిగిన సంభాషణ సహకారం ఇకపై పాడి లేదా క్రెడిట్ సొసైటీలకే పరిమితం కాదని స్పష్టం చేసింది. ఈ ఉద్యమం ఇప్పుడు ప్రతి గ్రామ గృహానికి చేరుకుంటోంది, ఇక్కడ ఆవు పేడను ఇకపై వ్యర్థంగా చూడరు, కానీ శ్రేయస్సుకు మూలంగా చూస్తారు. పశువుల పెంపకం మరియు సహజ వ్యవసాయం యొక్క కలయిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్వయం సమృద్ధి యొక్క కొత్త శిఖరాల వైపు నడిపిస్తోంది. మహిళలు ఇప్పుడు పాల ఉత్పత్తిలో మాత్రమే కాకుండా సేంద్రీయ ఎరువులు మరియు సహజ పురుగుమందుల తయారీలో కూడా చురుకుగా పాల్గొంటున్నారు.నేడు, భారతదేశంలోని మారుమూల గ్రామాల్లో సహజ వ్యవసాయ నమూనాలు రూపుదిద్దుకుంటున్నందున మరియు సహకార సంఘాలు సేంద్రీయ ఉత్పత్తుల బ్రాండింగ్ మరియు మార్కెటింగ్కు నాయకత్వం వహిస్తున్నందున, భారతదేశం తన వ్యవసాయాన్ని దాని మూలాలకు తిరిగి అనుసంధానిస్తున్నట్లు మరియు సహకారం ద్వారా పచ్చని, ఆరోగ్యకరమైన మరియు మరింత స్థిరమైన భవిష్యత్తు వైపు పయనిస్తోందని స్పష్టంగా తెలుస్తుంది.సహకార్ సంవాద్ ద్వారా భారతదేశం అంతటా సహకార మహిళలతో షా పాల్గొన్నప్పుడు, అది కేవలం ఒక కార్యక్రమం కాదు, అది ఒక ఉద్యమం యొక్క వ్యక్తీకరణ. ఈ ఉద్యమం వెనుక సంవత్సరాల అంకితభావం, సంస్థాగత అంతర్దృష్టి మరియు లోతైన సాంస్కృతిక అవగాహన ఉన్నాయి. పరిపాలనా చతురతను తీసుకురావడమే కాకుండా, భారతీయ గుర్తింపులో అంతర్లీనంగా ఉన్న ప్రకృతితో సహకారం మరియు సామరస్యం యొక్క స్ఫూర్తిని కూడా అర్థం చేసుకునే నాయకత్వంలో ఇవన్నీ సాధ్యమయ్యాయి.

ఈ రోజు, ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో మరియు అమిత్ షా మార్గదర్శకత్వంలో, 'సహకార్ సే సమృద్ధి' (సహకారం ద్వారా శ్రేయస్సు) నినాదం ఇకపై కేవలం నినాదం కాదు, ఇది భారతదేశ ఆర్థిక మరియు సామాజిక పరివర్తన యొక్క సజీవ వాస్తవికతగా మారుతోంది.

# త్వరలోనే డాలర్‌కు ఆల్టర్నేటివ్?

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని వెల్లడించింది. దీంతో భారత్, చైనా వంటి దేశాలు వాటి సొంత కరెన్సీల్లోనే ట్రేడింగ్ చేస్తున్నాయని పేర్కొంది. డాలరేతర కరెన్సీల్లో ట్రేడింగ్ చేస్తున్నందుకు బ్రిక్స్ దేశాలపై 10 శాతం పన్నును ట్రంప్ ప్రతిపాదించారు. వాషింగ్టన్ ఒంటెత్తు పోకడల వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విషయాన్ని గుర్తించడం లేదని జీటీఆర్ఐ శుక్రవారం వెల్లడించింది. 'వివిధ దేశాలు డాలర్ నుంచి దూరంగా జరగడం తిరుగుబాటు కాదు. వారికి మిగిలింది అదొక్కటే మార్గం. రష్యా-చైనాల మధ్య 90 శాతం వాణిజ్యం రష్యా రూబుల్ లేదా చైనా యువాన్లలో జరుగుతోంది. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు గాను భారత్ రూపాయలు, దిర్హామ్‌లతో చెల్లింపులు చేస్తోంది. చివరికి పెట్రో డాలర్ ఒప్పందం చేసుకొన్న సౌదీ అరేబియా కూడా డాలరేతర చమురు వ్యాపారానికి తెర తీసింది. అమెరికా ఆంక్షలే ఆయా దేశాలను తొలుత డాలర్ ప్రత్యామ్నాయాలు వెతికేటట్లు చేస్తోంది. ఇక బ్రిక్స్ దేశాలపై 10శాతం పన్ను.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే 500శాతం టారిఫ్లు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను మరింత జటిలం చేస్తున్నాయి'' అని జీటీఆర్ఐ అజయ్ శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు.

ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లోని 11,000 బ్యాంకులను స్విఫ్ట్ వ్యవస్థ అనుసంధానిస్తుందని శ్రీవాస్తవ వెల్లడించారు. ఇది తటస్థ వేదికగా చెబుతారు. కానీ, అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్, వెనుజువెలా, రష్యాలకు స్విఫ్ట్ సేవలను నిలిపివేశారన్నారు. దీంతో ఈ దేశాల నుంచి చమురు, గ్యాస్ కొనేవారు.. డాలర్కు ప్రత్యామ్నాయాలను ఎంచుకొని చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. ఇవి ఆయా దేశాల డాలర్ వ్యతిరేక విధానాలు కాదని.. రక్షణాత్మక వ్యవస్థలని చెప్పారు. వీటిని ప్రేరేపించేవి అమెరికా ఆంక్షలే అని వెల్లడించారు. డాలర్ల కొరత ఉన్న దేశాలతో ట్రేడ్ సెటిల్మెంట్‌లు రూపాయల్లో చేసుకొనేందుకు 2022లో ఆర్బీఐ అనుమతించింది. ఈక్రమంలో రష్యా బ్యాంకులు చమురు చెల్లింపుల సెటిల్మెంట్లు కూడా రూపీ అకౌంట్స్ ను తెరిచాయి. మరోవైపు బ్రిక్సుకు కామన్ కరెన్సీని తీసుకురావాలన్న ప్రతిపాదనను భారత్, చైనాలు తిరస్కరించాయి. స్థానిక కరెన్సీల్లో ట్రేడింగ్ చేసుకొంటే.. డబుల్ డాలర్ కన్వర్షన్లను తప్పించుకోవచ్చు.. అప్పుడు కనీసం 4శాతం వరకు అయ్యే ఖర్చు ఆదా అవుతుందని జీటీఆర్ఐ నివేదికలో అభిప్రాయపడింది. ఈవిషయాన్ని ఆయా దేశాలు గ్రహించేకొద్దీ స్థానిక కరెన్సీల్లోనే టేడింగ్ జరుగుతుందని ఆ సంస్థ అభిప్రాయపడింది.

# గవర్నర్‌ను కలిసిన సీఎం

**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రాజ్ భవన్ లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు.

# హుబ్లీలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఊరేగింపు



**మంత్రాలయం, జూలై 11 (మనం న్యూస్ ):** ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులను హుబ్లీలో ఘనంగా ఊరేగించారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీని సందర్శించిన ఆయనకు , శ్రీ మఠం భక్తులు శిష్యులు మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేశ ప్రజల సుభిక్షం కోసం సుదర్శన హోమం నిర్వహించారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ స్వామీజీకి తులాభారం చేసి చేయడం భక్తిని చాటుకున్నారు. భక్తులకు ముద్రాధారణతో ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

# టీటీడీలో అన్యమతస్తులకు ఉద్యోగాలెలా ఇస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి నోచుకోని పురాతన దేవాలయాలను గుర్తించి టీటీడీ నిధులను కేటాయించి యుద్ధ ప్రాతిపదికన ప్రణాళిక రూపొందించి అభివృద్ధి చేయాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ లోని కరీంనగర్ లో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. వెంటనే నిర్మించాలి. ఇల్లందకుంట రామాలయం, కొండగట్టు అంజన్న ఆలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. తిరుమల హిందువుల ఆస్తి. విదేశీయులు, అన్యమతస్తులు స్వామివారిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ తప్పనిసరి. అటువంటిది దురదృష్టమేమిటంటే టీటీడీలో వెయ్యి మందికిపైగా ఇతర అన్యమతస్తులు ఉద్యోగాలు చేస్తున్నారు.వారికి హిందు మతంపై, దేవుడిపై నమ్మకం లేదు. అటువంటి వారికి టీటీడీలో ఉద్యోగాలివ్వమేంటి? వాళ్లను కొనసాగించడమేంటి? ఇట్లాంటి పద్ధతి మంచిది కాదు. ఇతర మతస్తులు టీటీడీలో పనిచేస్తున్నందున ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోంది. స్వామివారిపై నమ్మకంలేని వ్యక్తులకు జీతాలిచ్చి ఎందుకు పోషిస్తున్నారు. హిందువులంతా దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది హిందువుల ఆస్తి. ఎప్పుడో వాళ్లను నియమించారని చెప్పి తప్పించుకోవడం సరికాదు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వాళ్లను కొనసాగించడం కరెక్ట్ కాదు తక్షణమే వాళ్లను తొలగించాలని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## రౌడీయిజంతో బెదిరించాలని చూస్తే ఊరుకునేది లేదు: పయ్యావుల కేశవ్

**అమరావతి:** రుణాలను అడ్డుకునేందుకు వైకాపా నేతలు కుటిల యత్నాలు చేస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులను తప్పుడు మెయిల్స్‌తో అడ్డుకునే యత్నం చేస్తారా అని ప్రశ్నించారు. యువతకు మేలు జరుగుతుంటే వైకాపా నేతలు అడ్డుకునే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు మెయిల్స్ పెట్టి లేఖలు రాసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో రౌడీయిజంతో బెదిరించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## నలుగురు వేధిస్తున్నారని 50 మంది విద్యార్థినుల ఫిర్యాదు: కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

**కాకినాడ:** రంగరాయ వైద్య కళాశాల లో విద్యార్థినులకు లైంగిక వేధింపుల ఘటనలో బాధ్యులను సస్పెండ్ చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు.''ఈనెల 9న కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌కు ఓ విద్యార్థిని నుంచి మెయిల్ వచ్చింది. నలుగురు వేధిస్తున్నారని 50 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో ఉన్న కల్యాణ్ చక్రవర్తిపై ఎక్కువ ఫిర్యాదులు అందాయి. వాట్సప్‌లో అసభ్య మెసేజ్‌లు, వ్యాఖ్యలు చేస్తున్నట్లు గుర్తించాం. కొంతమంది విద్యార్థులతో మాట్లాడినప్పుడు కల్యాణ్ చక్రవర్తితో పాటు జిమ్మిరాజు, గోపాలకృష్ణ, ప్రసాద్ పేర్లు కూడా వచ్చాయి. వారిపైనా చర్యలు తీసుకున్నాం. వారిని సస్పెండ్ చేసిన అనంతరం విచారణ చేపట్టాం. కళాశాలలో గతంలో ఇలాంటివి జరిగాయా? అనే కోణంలో విచారించాం. వేధింపులపై మెయిల్ పంపిన విద్యార్థినిని అభినందిస్తున్నాం''అని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# వైద్య విద్యలో అంకిత భావంముఖ్యం



- **ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ చంద్రశేఖర్...**

**కర్నూలు జూలై 11 (మనం న్యూస్):** వైద్య విద్య అన్నది కేవలం చదువుకోవడం మాత్రమే కాదని అంకితభావంతో కూడుకున్నదని వైద్య విద్యలో విద్యతో పాటు ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉన్నదని ప్రజల ఆరోగ్యం పరంగా అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించి నపుడు వైద్యులను దేవుళ్ళ గా చూస్తారని కావున వైద్య విద్య నేర్పే గురువులకు ఎంతో బాధ్యత వుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ ఉత్తమ డాక్టర్లను సమాజానికి అందించాలని కోరారు. వైద్య విద్యార్థులకు వ హాజరు శాతం చాల ముఖ్యమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కర్నూల్ మెడికల్ కాలేజీ సందర్శించిన ఆయన అక్కడ మీకు డాక్టర్ రఘునందన్ తో కలిసి వివిధ విభాగాల అధిపతులు ప్రొఫెసర్స్ తో కాలేజీలోని కాన్ఫరెన్స్ హాల్ యందు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజ్ యందు స్కిల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ వైద్య విద్య ప్రక్షాళనకు, ఆసుపత్రుల అభివృద్ధికి కట్టబడి ఉన్నారని అందుకు తగ్గట్టు గా పూర్తి సహకారం అందిస్తున్నారని ఆరు నెలల కాలంలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలను సందర్శించి రివ్యూ చేస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీలో అభివృద్ధికి రీసెర్చ్ కార్యక్రమాలకు ప్రతి మెడికల్ కాలేజీకి కోటి రూపాయలు కేటాయిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కాలేజీలలో అవసరమైన పారామెడికల్ కోర్సులకు ప్రతిపాదనలు పంపాలని వెంటనే అనుమతులు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని మెడికల్ కాలేజీలో విజయవంతంగా నిర్వహించామని, ఈసారి అన్ని మెడికల్ కాలేజీలు అధికారికంగా డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి సీనియర్ వైద్యులకు సన్మానాలను నిర్వహించవున్నారు. రాబోయే కాలంలో వైద్య కళాశాలల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు గేమ్స్ కు అధిక ప్రాధాన్యతను ఇస్తామన్నారు. మెడికల్ ఎగ్జామ్స్ ను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని సెంటర్లలో ఆన్లైన్ వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య కళాశాలలో సమస్యల పరిష్కారం కొరకు ఈఎంఈ హెల్త్ యూనివర్సిటీ సంయుక్తంగా కళాశాలలో రివ్యూ చేయడం ద్వారా అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి అవకాశం ఏర్పడిందని మొదటగా ఆ కార్యక్రమాన్ని కర్నూల్లోనే శ్రీకారం చుట్టామన్నారు. మెడికల్ కాలేజీలు ఆసుపత్రిలో జరుగుతున్న డెవలప్మెంట్ గురించి మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆసుపత్రి సూపరిండెంట్ లు నెలకొకసారి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేయాలన్నారు. డిపార్ట్మెంట్స్ వారీగా రీసెర్చ్ కార్యక్రమాలపై అప్డేట్స్ ను ఈ పేపర్ ద్వారా ప్రచురణ చేయాలన్నారు. రెండు గంటలపాటు జరిగిన వివిధ విభాగాల అధిపతులు మరియు ప్రొఫెసర్స్ రివ్యూ లో ఆయా విభాగాల వారీగా ప్రజెంటేషన్ చేయగా వారి సమస్యలను వెంటనే వ్రాసుకుని తదనంతరం నిర్వహించిన కాలేజ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో ఆ సమస్యలకు పరిష్కారం గురించి పరిష్కార వార్గాలు సూచించడం జరిగింది. న్యూ లెక్చరర్ గ్యాలరీలో పీజీలు హౌస్ సర్జన్లు వైద్య విద్యార్థులతో వైస్ ఛాన్స్ లర్ ముచ్చటించడం జరిగింది అనంతరం వారి సమస్యల గురించి తెలుసుకొని త్వరలో వీరిని వీలైనన్ని సమస్యలు పరిష్కరిస్తామని తదుపరి సందర్శనలో హాస్టల్స్ సందర్శనని కూడా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ సూపరిండెంట్ డాక్టర్ నరసింహులు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ రేణుక దేవి, డాక్టర్ విజయ ఆనంద్ బాబు, డాక్టర్ సింధియా శుభప్రద, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీరాములు, సిడిఎస్ కమిటీ సభ్యులు, ఏపీ ఎమ్ఐ డిసి ఇంజనీర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పురమిత్రతో ఇంటి నుంచే మున్సిపల్ సేవలు

- ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించండి
- నగర పాలక కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి, జూలై 11(మనం న్యూస్):** మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పురమిత్ర యాప్ ద్వారా మీ ఇంటివద్దే సేవలు పొందవచ్చునని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు.

శుక్రవారం నగరంలోని తిరుమల రెడ్డి నగర్ వార్డుల్లో ఇంటింటి సర్వేను కమిషనర్ అధికారుల తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నివసిస్తున్న వారి స్థితి గతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. పేదరికంలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తగు సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. సిబ్బంది త్వరగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన పురమిత్ర యాప్ ను ప్రజలందరూ డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. ఈ యాప్ ద్వారా మీరు ఇంటినుండే అని ఇచ్చే పిర్యాదులను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### జడ్పీ నిధులతో మంజూరైన

# పనులను త్వరితగతిన పూర్తి చేయండి

- జిల్లాలో జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసి పనులు పూర్తి చేయండి
- మంజూరైన పనులలో ప్రారంభం కాని పనులు రద్దు చేయబడతాయి
- వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, జూలై 11(మనం న్యూస్):** చిత్తూరు జెడ్పీ, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంజూరు అయిన పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుండి జిల్లాలో జెడ్పి మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై ఎంపీడీవోలు ఆర్డబ్ల్యూఎస్ మరియు పంచాయతీ సెక్రెటరీ తో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల్లో జడ్పీ మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి త్రాగునీరు, సిమెంట్ రోడ్స్, మురుగునీటి కాలువలకు సంబంధించిపనులనుమంజూరు చేయడం జరిగిందని, పురో గతిలో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నిధులు మంజూరై ప్రారంభం గాని పనులను రద్దు చేయాలని తెలిపారు.

పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. మండలాలలో ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిధులు మంజూరు చేయడం జరిగిందని, పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు. త్రాగునీరు, డ్రైన్స్‌కు సంబంధించి రూ.5 లక్షల లోపు పనులను 15 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో గ్రామసభల ద్వారా గుర్తించి ఆమోదించిన పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పనుల పురోగతికి సంబంధించి జెడ్పీ సీఈవో, డీపీఓలు సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెలకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇంటింటి చెత్త సేకరణ సమర్థవంతంగా చేయాలని, సేకరించిన చెత్తను ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పంచాయతీ సెక్రెటరీ, ఏఈలను సమన్వయం చేసుకొని వ్యాధులు ప్రబలకుండా ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా ఓవర్ హెడ్ ట్యాంక్స్ ను శుభ్రం చేయాలని, పంపుసెట్లు, బోర్వెల్స్ దగ్గర బహిరంగ మలమూత్ర విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, త్రాగునీటి పైపులల్లోకి మురుగునీరు కలవకుండా అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జడ్పీ సీఈఓ రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ చంద్ర శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవల సంస్కరణలపై టీటీడీ సమీక్ష

- అన్నమయ్య భవన్‌లో పలు రకాల సేవలపై సమీక్షించిన టీటీడీ ఈవో, అదనపు ఈవో



**తిరుమల, జూలై 11(మనం న్యూస్):** శ్రీవారి సేవ స్వచ్చంద వ్యవస్థలో తీసుకురానున్న సంస్కరణలపై టీటీడీ ఈవో జే.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న ప్రొఫెషనల్ శ్రీవారి సేవ, ఎన్ఆర్ఐ సేవ, గ్రూప్ సూపర్వైజర్ల సేవల కార్యాచరణ పురోగతి గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఐఐఎం-అహ్మదాబాద్ బృందంచే గ్రూప్ సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని ఈఓ ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఐటి డిపార్ట్మెంట్ పవర్ పాయింట్ ద్వారా గ్రూప్ సూపర్వైసర్ కొరకు రూపొందించిన అప్లికేషన్ ను చూపించారు. అదే విధంగా ఎన్ఆర్ఐ సేవ వృత్తిపరమైన సేవలను కూడా త్వరిత గతిన ప్రారంభించాలని, ఎన్నారై సేవలను విస్తరించేందుకు ఏపి.ఎన్.ఆర్.టి సంస్థతో సంప్రదింపులు చేయాలని శ్రీవారి సేవ అధికారులను ఈఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ రవాణాశాఖ మరియు ఐటి జీఎం శేషారెడ్డి, ముఖ్య ప్రజా సంబంధాల అధికారి టీ.రవి, అశ్విని ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్. కుసుమ కుమారి, పి ఆర్ ఓ కుమారి. నీలిమ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్



**తిరుపతి కలెక్టరేట్, జూలై 11 (మనం న్యూస్):** శుక్రవారం వివాదంలో ఉన్న తిరుపతి డివిజన్ పరి ధిలోని తిరుపతి రూరల్, అర్బన్ మండలాలలో విస్తరించి ఉన్న సర్వే నం.145, 147లు హంథి రాంజి మఠం, పరకాల మఠం భూములను తిరుప తి ఆర్డిఓ రామ్మోహన్, జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెం కటేశ్వర్ ఆదేశాల మేరకు సంబంధిత తహసిల్దార్ తో కలిసి పరిశీలించారు. ఈ భూములు వివాదానికి సంబంధించి హైకోర్టు స్టేటస్ కో విధించడం జరిగింది. ఈ స్టేటస్ కో ను ఉల్లంఘించి పరకాల మఠం ద్వారా పొందిన నరసింహారెడ్డి అతని తరపు మనుషులు కోర్టు ధిక్కారానికి పాల్పడి కోర్టు ఉత్త ర్వులు పరిగణలోకి తీసుకోకుండా సదరు స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారని సమాచారం అందుకున్న ఎండోమెంట్ ఈవో బాపిరెడ్డి, తిరుపతి రెవిన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్ రామాంజనేయులు నాయక్ అలాగే చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ ఎం ఆర్ పల్లి సదరు స్థలాన్ని పరిశీలించి కోర్టు స్టేటస్ కో వచ్చినప్పటికీ అందులో నిర్మాణాలు చేస్తున్న టువంటి నరసింహారెడ్డి తరపు మనుషులను పిలిపించి నిర్మాణాలు చేయరాదని సూచించారు. ఎవరైనా కూడా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మాణాలు చేపడితే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. అవిలాలలో ఆక్రమణకు గురైన కాలవ పొరంబోకును తొలగించడం కోసం వెళ్లినప్పుడు సేతు మాధవ్ అనే వ్యక్తి ఇతరులు కలిసి తాసిల్దార్ ను అడ్డుకోవడం జరిగిందని అన్నారు. 147 సర్వే నంబర్స్ సంబంధించిన భూమి ఇది అని, 146 కాదని వాదించడం జరిగిందని ఈ సందర్భంగా ఇది ప్రభుత్వ భూమి సుప్రీంకోర్టు సూచన మేరకు వాటర్ బాడీ కాబట్టి ఇందులో ఆక్రమణలు సహించమని చెప్పారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ డిపార్ట్మెంట్ వారు ఎండోమెంట్ భూముల సంబంధించి రెవెన్యూ కాలువ పొరంబోకు ఆక్రమణకు సంబంధించిన రెవెన్యూ వారు సదరూ సేతుమాధవ్, ఇతరులను హెచ్చరించడం జరిగింది, ఈ సందర్భంగా కోర్టు దిక్కారానికి ఎవరైనా పాల్పడితే వారిని ఉపేక్షించేది లేదు వారి పైన కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించడం జరిగింది. హైకోర్టు వారు స్టేటస్ కో విధించినప్పటికీ మఠం భూములను ఆక్రమించడం, నిర్మాణాలు చేయడం వల్ల వారిని హెచ్చరించి ఆక్రమణకు పాల్పడద్దని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.

## భద్రతా ప్రణాళికలపై టీటీడీ సమావేశం



**తిరుమల,జూలై 11(మనం న్యూస్):** భక్తుల సౌకర్యార్థం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తిరుమలలో భద్రతా ప్రణాళికలపై ఎల్‌టీ సంస్థ ప్రతినిధులతో టీటీడీ ఈవో జే.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు టీటీడీ భద్రతా వ్యవస్థను మరింత ఆధునీకరించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక భద్రతా సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా అలిపిరి తనిఖీ కేంద్రం ఆధునీకరణ, అధిక సామర్థ్యం కలిగిన స్కానర్లు, త్వరితగతిన తనిఖీలు పూర్తయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పార్కింగ్ మేనేజ్మెంట్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సర్వేలన్స్ సిస్టం, కామన్ అలారం మానేజ్మెంట్ సిస్టం, ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ వ్యవస్థ, నో హెల్మెట్ డిటెక్షన్, ఆటోమెటిక్ ట్రాఫిక్ కంట్రోల్ క్లారిఫికేషన్, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ వంటి అంశాలను ఈవోకు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 40 ఏళ్లకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అదే విధంగా దీర్ఘ కాలిక, స్వల్ప కాలిక ప్రణాళికలు రూపొందించాలని ఎల్‌టీ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో సీవీఎస్వో మురళీకృష్ణ, సిఈ సత్య నారాయణ, ఎల్‌టీ ప్రతినిధుల నిపుణుల బృందం, ట్రాన్స్ పోర్ట్ మరియు ఐటి జీఎం శేషారెడ్డి, ఏఎస్పీ రామకృష్ణ, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, సదా లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ



**తిరుపతి, జూలై 11(మనం న్యూస్):** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 12వ తేదీ శనివారం జరగనున్న పుష్పయాగానికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. అంకురార్పణ సందర్భంగా స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి కొలువు, అర్చన, నివేదన నిర్వహించారు. అనంతరం, మూలవర్లకు అభిషేకం చేపట్టారు. అటు తర్వాత ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆచార్య ఋత్విక్వరణము జరిగింది. సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు మేధిని పూజ, సేనాధిపతి ఉత్సవం, తదుపరి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. జూలై 12వ తేది శనివారం ఉదయం 11.00 గంటల నుండి 12.00 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పలు రకాల పుష్పాలతో అభిషేకం చేస్తారు. ఆలయంలో జూన్ 07 నుండి 15వ తేదీ వరకు వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల తెలిసీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యతలను పెంపొందించుకోవాలి




**రామచంద్రాపురం, జూలై 11(మనం న్యూస్):** విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నైపుణ్యతలను పెంపొందించుకోవాలని జేఎన్ టీయూ - ఆయిల్ టెక్నాలాజికల్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి. సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామాపురం గ్రామంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో 4వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, వృత్తి నైపుణ్యతను మెరుగుపరచుకోవాలని పిలుపునిచ్చారు. మైథిలి లైఫ్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ నైపుణ్యం ఉన్నవారికి రానున్న రోజుల్లో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం. సిరంజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. బి ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు, వివిధ విభాగాధిపతులు, డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, పరీక్షల నియంత్రణ అధికారి సతీష్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా కలెక్టర్ ముందడుగు

- ఐదు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, జూలై 11(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి-4 (పీపుల్స్, పార్టిసిపేషన్, ఫర్ ప్రోగ్రెస్ప్రాస్పెరిటీ) కార్యక్రమం కింద, తిరుపతి జిల్లాలో సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా జిల్లాలో అందరికీ ఆదర్శప్రాయంగా మొదటగా 5 బంగారు కుటుంబాలను దత్తతగా తీసుకొని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తన బాధ్యతను చాటారు. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు సమీపంలో గల నక్కల కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలను, దామినేడుకు చెందిన 1 కుటుంభాన్ని మొత్తం 5 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబ సభ్యులు అందరూ కలిసి కలెక్టర్ కి కృతజ్ఞత భావంతో ధన్యవాదాలు తెలిపారు.



1. ఎస్. సావిత్రమ్మ, ఏలుమలై కుటుంబం
2. వేదవల్లి, విజయశాంతి, విష్ణు అనిత, గంగోత్రి, బాబు కుటుంబం
3. అంబికా, నందు, వీరభద్ర, చిన్నతంబి కుటుంబం
4. బలరాం, అనిత, కర్ప స్వామి, గాంధీ, శాంతి కుటుంబం
5. దామినేడుకు చెందిన విజయశాంతి, బాబు, ధనుష్, యోగి కుటుంబలను కలెక్టర్ దత్తత తీసుకోవడం ద్వారా, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలలో పునాదులు ఏర్పడేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కుటుంబాల సంక్షేమం కోసం వ్యక్తిగతంగానే కాకుండా, జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల సహకారంతో కూడిన సమన్వయంతో సహాయాన్ని అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమం జిల్లాలోని అధికారులకు ప్రజా ప్రతినిధులకు, సమాజసేవకులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుంటే గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా యంత్రాంగం ప్రజలతో నేరుగా అనుసంధానం సాధించి, అభివృద్ధిని క్రియాశీలంగా అమలు చేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అన్నారు.

## పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి



**జగిత్యాల జూలై 11(మనం ప్రతినిధి):** ఉపాధ్యాయులకు సంబంధించి ఏడాదిగా పెండింగులో ఉ న్న అన్ని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జగి త్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి ప్రసాద రావు, నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులను కలుస్తూ తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బోయినపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రతా కార్డులు అందించాలని కోరారు. అనంతరం, తపస్ నాయకులు మాట్లాడుతూ జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, రిటైర్మెంట్ బెనిఫిట్లతో పాటు పెండింగులో ఉన్న బిల్లులను, నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం జరగనున్న పదోన్నతుల ప్రక్రియలో పీఎస్ హెచ్ఎం ప్రమోషన్లలో బీఈడీ, డీఈడీలలో కామన్ సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ప్రజాస్వామ్యం!

ఒకరిని వేరొకరు
కొట్టడమే తప్పనుకుంటే
బట్టలిప్పి కొడతాననడం
అప్రజాస్వామికమే కాదు
నిరంకుశం కూడా!

రాజ్యాంగం మీద
ప్రమాణం చేసిన చేతులు
సిగ్గుతో నేలచూపులు చూస్తుంటాయి
లోపల బయట
అన్ పార్లమెంట్ మాటలు వినీ వినీ
అసెంబ్లీ పార్లమెంటు చెవులు మూసుకుంటవి!
వాగ్దానాలు మేనిఫెస్టోలు
గెలిచే దాకా అతి పవిత్రం
ఆ తర్వాత....

అవి దుమ్ము కొట్టుకుపోయి
ముఖం చాటేస్తుంటాయి!
అధికారం డబ్బు ఏకమై
ఒకచోట చేతులు కలిపాక
ప్రజాపాలన అభాసు పాలై
బిక్కు బిక్కు మంటుంటది
సుదీర్ఘ ప్రజాస్వామ్యాన్ని
చవిచూచిన ఈ భారతదేశం
లోపలి సంక్షోభాల్ని ఎన్నడూ
బయటి ప్రపంచానికి తెలియనివ్వదు!

భ్రమ పూరిత ప్రజాస్వామ్యంలో
ఇప్పుడు హక్కులు బాధ్యతలు
బాగా కలిసిపోయిన పాలూ నీళ్ళే!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# అంచనాలు తప్పుతున్న వానలు



మనదేశంలో వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే అంటే.. ఏప్రిల్, మే నెలల్లో వాతావరణ శాఖ రెండుసార్లు వాతావరణ పరిస్థితుల అంచనాలను విడుదల చేస్తుంది. అలా గత ఏప్రిల్, మే నెలలో ఇచ్చిన అంచనాలు నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే వస్తాయని చెప్పింది. అలానే మే చివర,జూన్ మొదట్లోనే పలకరించి ముందస్తు మురిపించింది.నేటికీ జులై మాసం మధ్యలోకి వచ్చినా కూడా మేఘాలు మురిపిస్తూ వర్షాలు మాత్రం కురిపించడం లేదు.కానీ ఉత్తర భారత దేశంలో భారీ వర్షాలతో జలదిగ్బంధంలో జన జీవనాన్నిఅతలా కుతలం చేస్తుంది.

అంటే వానాకాలం సీజన్ ప్రాంతాలవారీగా పడితే,అతివృష్టి లేదంటే అనావృష్టితో ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని 'రెంటికి చెడ్డ రేవడిలా' చేస్తుంది. దీని ప్రభావం దేశ ఆర్థిక పరిస్థితులపై, ప్రజల జీవన విధానంపై మెండుగా పడుతుంది. ఇంతగా మార్పులకు ప్రధాన కారణం మనిషి స్వార్థం, పాలకులసామ్రాజ్యకాంక్ష,పారిశ్రామికీకరణ,కార్పోరేటీకరణల వల్లనే అనేది కాదనలేని వాస్తవం.మనం సృష్టించలేని పంచభూతాలను విధ్వంసం చేస్తున్నాం..ఎంతగా అంటే? మన మనుగడకు విఘాతం కలిగిస్తుందన్న సోయి కూడా లేకుండా. భూ వాతావరణం వేడెక్కేలా,గాలి,నీరు పర్యావరణం కలుషితమయ్యేలా(పొల్యూషన్, పెస్టిసైడ్, ప్లాస్టిక)వీటి వల్ల కాలుష్యమై సమతుల్యత గాడి తప్పి ఏడాది పొడుగునా ఉకపోతే, మరోవైపు అకాల వర్షాలు, శీతాకాలం కూడా గాడి తప్పుతోంది. ఈ స్థితికి కారణం మనుష్యులే.

మనం కూర్చున్న కొమ్మను మనమే నర్కుంటున్నా మన్న 'ఇంగిత జ్ఞానం' లేని స్థితికి మనిషి స్వార్థం పెరిగిపోయింది.

'నైరుతి పైన ప్రభావం' మన దేశంలో వ్యవసాయ రంగానికి కీలకమైన నైరుతి రుతు పవన వర్షాల్లోనూ ఏటికేడు మార్పులు చోటు చేసుకున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. హిందూ మహాసముద్రం వేగంగా వేడెక్కడంతో మెరిడియల్ థర్మల్ గ్రేడియంట్ బలహీనపడి రుతుపవనాల గమనం మందగిస్తుంది. దేశవ్యాప్తంగా ఈ సీజన్లో కురిసే వర్షాల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. దీని ప్రభావం భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంపై పడుతోంది. సాధారణంగా జూన్ 1 నుంచి నైరుతి సీజన్ మొదలవుతుంది. ఈసారి ముందుగానే రుతుపవనాలు



కేరళను తాకాయి. జూన్ లో నమోదు కావాల్సిన వర్షపాతం ముందుగానే వేసవిలో నమోదయింది.

'రోజుకు సగటున 6.5 మిల్లీమీటర్ల పైగా వర్షం.' వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా తరచూ తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. నైరుతిలో మధ్య భారతంలో 1950 నుంచి 2015 మధ్యలో సగటున రోజుకు 150 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసిన సందర్భాలు 75 శాతం మేర పెరిగాయి. కరువు ప్రాంతాలైన రాజస్థాన్ ,గుజరాత్ లో వర్షపాతం గణనీయంగా పెరుగుతుంది. కొద్దిరోజులుగా గుజరాత్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి తరచూ వరదలు సంభవిస్తున్నాయి. అలాగే దేశంలోని జిల్లాల వారీగాను వార్షిక వర్షపాతం లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. సౌరాష్ట్ర ,కచ్ రాజస్థాన్‌లోని ఆగ్నేయ ప్రాంతాలు, తమిళనాడులో ఉత్తర, ఏపీలోని ఉత్తరాంధ్ర, నైరుతి ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ప్రశ్చిమ బెంగాల్, మణిపూర్, మిజోరాం, కొంకణ్, గోవా, ఉత్తరఖండ్‌లో నైరుతిలో రోజుకు సగటున 6.5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసింది. అలాగే గత 30 ఏళ్లలో వార్షిక వర్షపాతం లో ఉత్తర్ ప్రదేశ్ ,బీహార్, మేఘాలయ, పశ్చిమబెంగాల్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ తదిత రాష్ట్రాల్లో గణనీయమైన తగ్గుదల కనిపించింది. ఇలా వాతావరణ మార్పుల ప్రభావంతో దేశంలోని రాష్ట్రాల్లోనూ వర్షపాతంలో వైవిధ్యం కనబడుతోంది. నిర్మలంగా ఉన్న ఆకాశం ఒక్కసారిగా ఉరుముతుంది. జల్లులు మొదలై గంటల వ్యవధిలో కుంభవృష్టిగ కురుస్తుంది. ఆకస్మిక వరదల ప్రభావంతో ప్రాణ,ఆస్తినష్టం సంభవిస్తుంది. గత ఏడాది విజయవాడలో కురిసిన కుంభవృష్టి మొదలు తాజాగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ లోని ఆకస్మిక వరదల వరకు ఇదే ధోరణి, వాతావరణ మార్పుల ప్రభావం వర్షపాత క్రమాన్ని మార్చేస్తుంది. కొన్నేళ్లుగా వర్షాలు కురుస్తున్న రోజులు తగ్గుతుండగా.. తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదవుతోంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆధ్వర్యంలో గతంలో జరిగే దీర్ఘకాలిక సమాచార విశ్లేషణలోనూ ఈ విషయం వెల్లడైంది. ఇలా వాతావరణ మార్పుల కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో అతి భారీ వర్షపాతం సహా ప్రకృతి వైపరీత్యాల్లో (సివియర్ వెదర్) తాత్కాలిక, ప్రాదేశిక వైవిధ్యం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ మార్పులు భవిష్యత్తులోన కొనసాగుతాయని వీటిని నివారించలేమని గతంలోనే ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) నివేదికలోనూ ప్రస్తావించారు.ఇలానే తెలంగాణలో మరియు ఆంధ్రప్రదేశ్ ల్లో పలు జిల్లాల వారీగా ,ప్రాంతాలవారీగా అధిక వర్షం ఓవైపు తక్కువ వర్షం మరోవైపు కురుస్తూ సమతుల్యత దెబ్బ తింటున్నది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ, ఇతర రంగాల్లో ప్రణాళికలు సరి చేసుకోవాల్సివుంది.దేశవ్యాప్త సగటు వర్షపాతం క్రమంగా పెరుగుతుందని ఓ అంచనా. దేశంలో వరదల ముప్పు ఎక్కువగా పొంచి ఉన్న రాష్ట్రాల్లో అస్సాం మొదటి స్థానంలో ఉంది. ఆ జాబితాలో తెలుగు రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయి. గత నాలుగు దశాబ్దాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండో స్థానానికి రావడం ఇదే తొలిసారి. మూడో స్థానంలో కర్ణాటక, నాలుగో స్థానంలో మహారాష్ట్ర ఉన్నాయి.

ఇలా అంచనా తప్పి తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం సంభవించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ, ఇతర రంగాల్లో ప్రణాళికసరిచేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇదంతా రాత్రికి రాత్రో, ఒక్క రోజులో వచ్చిన మార్పు కాదు. మానవుడు ప్రకృతి విరుద్ధ జీవనం విడనాడాలి. పాలకులు శీఘ్ర అభివృద్ధి, పారిశ్రామికీకరణ పేరుతో కాలుష్యాన్ని పెంచి పోషించడం, నేల కనిపించకుండా కాంక్రీట్ జంగల్ గా మార్చడం, నగరీకరణ పేరుతో నేలను నిలువెల్లా గుల్లపొడుస్తున్న తీరు మారాలి. పర్యావరణానికి హాని జరగకుండా అభివృద్ధికి బాటలు పరచాలి. ముమ్మాటికి ఇది పాలకులు, పాలితులు, కార్పొరేట్ వర్గాలు సంఘటితంగా కంకణ బద్ధులైతేనేసాధ్యం. ఋతువులు గతి తప్పక సమశీతోష్ణస్థితి ఏర్పడితే మానవ మనుగడ సవ్యంగా సాగుతోంది.

**- మేకిరి దామోదర్**
9573666650

# బౌద్ధుల ఆరాధ్య దైవం దలైలామా



దలైలామా పేరు చెబితే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది బౌద్ధుల హృదయాలు పూజ్య భావంతో బరువెక్కుతాయి. దలైలామా బుద్ధుల మత గురువే కాదు ప్రవాస టిబెట్ ప్రభుత్వానికి అధినేత కూడా.

1933లో 13వ దలైలామా నిర్యాణం తరువాత ప్రస్తుత దలైలామా 1935 జూలై 6 తేదీన ఉత్తర టిబెట్ లోని థక్సర్ లో పుట్టాడు. ఈయన అసలు పేరు లామోస్ తొండప్. నాలుగేళ్ళకే బౌద్ధ సన్యాసిగా మారిన తొండప్ తరువాత 14 వ దలైలామాగా అవతరించాడు.

**చైనా ఆక్రమణకు గురైన టిబెట్**

1954వ సంవత్సరంలో టిబెట్ చైనీయుల ఆక్రమణకు గురైంది. చైనీయుల వలసలు పెరిగిపోయి దేశం చైనా హస్తగతం అయింది. ఆ దశలో టిబెట్ పరిరక్షణ కోసం దలైలామా మావోసేటుంగ్, చౌ ఎన్ లై మొదలైన నాయకులతో చర్చలు జరిపారు. ఆ చర్చలు విఫలం కావటంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.చైనా టిబెట్ ని ఆక్రమించి, అక్కడ నుంచి దలైలామాని వెళ్ళగొట్టడంతో 1959 మార్చి 31నుండీ ఈయన భారతదేశంలో శరణార్థిగా ఉంటున్నారు.

ఆయన పరివారం ఆ ఏడాది మార్చి 30 న భారతదేశంలోకి ప్రవేశించి, ఏప్రిల్ 18న అస్సాంలోని తేజ్పూర్కు చేరుకున్నారు. భారతదేశంలో ఆశ్రయం పొంది 'ధర్మశాల'లో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలకి తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని ఎత్తైన కొండల మీద మెక్లోడ్ గంజ్ లో ఈయన నివాసం. అక్కడ నుంచే దలైలామా భక్తులకు దర్శనం ఇస్తుంటాడు.

**టిబెట్ సాంస్క ృతిక చరిత్ర**

క్రీస్తుపూర్వం ఆరవ, ఐదవ శతాబ్దాల వరకు మన దేశంలో అంతర్భాగంగా ఉండిన టిబెట్లో సహస్రాబ్దాల తరబడి వేదమతాలు విలసిల్లాయి. పంచభూతాలను ప్రకృతిని ప్రధానంగా ఆరాధించే వేదమతం వన మతం. త్రివిష్టపమ్- టిబెట్- ప్రాంతంలోని వన జనులు ప్రధానంగా ప్రకృతిని



ఆరాధించిన వన మతం వారు, వైదికులు. వనవాసీలు 'బన్‌పాస్'లుగా మారడం, 'వన మతం' 'బన్‌పాసీ' మతంగా మారడం టిబెట్ చరిత్ర. క్రీస్తునకు పూర్వం నాలుగవ శతాబ్ది నుంచి క్రీస్తుశకం 1959 వరకు దాదాపు రెండువేల నాలుగు వందల ఏళ్లపాటు స్వతంత్ర దేశంగా ఉండిన టిబెట్లోకి భారత్ నుంచి బౌద్ధమతం విస్తరించింది. 'బన్‌పాసీ'లలో అత్యధికులు బౌద్ధులు. సంస్క ృత భాషకు రూపాంతరమైన 'బోటీ' భాషల్లో ఒకటి త్రివిష్టప భాష- టిబెట్ ప్రజల ప్రస్తుత భాష. భారతీయ భాషలన్నింటి 'లిపుల'కు ప్రాతిపదిక 'బ్రాహ్మీ' లిపి. బ్రాహ్మీ లిపి నుంచి గురుముఖి, నాగరి, ద్రావిడ, బోటీ వంటి వివిధ భారతీయ లిపులు రూపొందాయి. టిబెట్ భాషా లిపి కూడ బ్రాహ్మీ లిపి నుంచి ఇలా పరిణతి చెందింది. టిబెట్ ప్రజల సంప్రదాయ మూలికా వైద్యం భారతీయ ఆయుర్వేద వైద్యానికి మరో ప్రక్రియ. టిబెట్ వైద్య ప్రక్రియ ఇప్పటికీ మన దేశమంతటా కొనసాగుతోంది. వివిధ నగరాల్లో, పట్టణాల్లో ఈ త్రి విష్టపీయ చికిత్సా కేంద్రాలు, ఔషధశాలలు వెలసి ఉన్నాయి.

**టిబెట్ రాజకీయ స్వాతంత్ర్యాన్ని హరించిన చైనా**

1959లో టిబెట్‌ను ఆక్రమించి టిబెట్ రాజకీయ స్వాతంత్ర్యాన్ని హరించింది. టిబెట్‌ను చెరసాలగా మార్చింది. టిబెట్ ప్రజలు చైనా దురాక్రమణను అప్పటి నుంచి ఇప్పటివరకు నిరసిస్తున్నారు, ప్రతిఘటిస్తున్నారు. ఈ 'ప్రతిఘటన' గురించి, చైనా కమ్యూనిస్టు నియంతల గురించి బయటి ప్రపంచానికి తెలియదు. చైనా ప్రభుత్వం తెలియనివ్వడం లేదు. విదేశాలకు చెందిన ప్రచార మాధ్యమ ప్రతినిధులు టిబెట్‌లో పర్యటించి వాస్తవాలను బయటి ప్రపంచానికి వెల్లడి చేయకుండా చైనా ప్రభుత్వం నిరోధిస్తోంది..

టిబెట్‌లో ఏమి జరుగుతున్నదన్నది కేవలం చైనా అధికార ప్రకటనల వల్ల మాత్రమే బాహ్య ప్రపంచానికి వెల్లడవుతోంది. అనేక సందర్భాల్లో చైనా అసలు సంగతులను దాచి అబద్ధాలను ప్రచారం చేస్తున్నది. విద్యార్థులను మత శిక్షణలో కాని, మత ప్రచారంలో కాని పాల్గొనరాదని చైనా నిషేధించడం గురించి చైనా అధికారిక ప్రచార మాధ్యమాల ద్వారానే వెల్లడి కావడం ఆశ్చర్యకరం. పాశ్చాత్య ప్రచార మాధ్యమాల ప్రతినిధులు అప్పుడప్పుడు కొన్ని రహస్యాలను రాబడుతున్నప్పటికీ టిబెట్లోని చైనా ప్రభుత్వ దమనకాండ చాలావరకు నిగూఢంగానే ఉండిపోతోంది. టిబెట్‌లో బౌద్ధమత నిష్ఠ ఉన్నంతవరకు ఆ దేశంపై తమ దురాక్రమణ పూర్తి కాజాలదన్నది చైనా భయం. అందువల్లనే ఆరు దశాబ్దాలుగా వందల కొలదీ బౌద్ధ ఆరామాలను చైనా మూత వేయించింది!

**దలైలామా వ్యవస్థ పట్ల టిబెటన్ల భక్తి శ్రద్ధలు**

బౌద్ధ మతస్థులు సహజంగానే దలైలామా వ్యవస్థ పట్ల భక్తి శ్రద్ధలను కలిగి ఉన్నారు. అందువల్ల ఇన్ని దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రస్తుత దలైలామా పట్ల టిబెట్ ప్రజల భక్తి శ్రద్ధలు సన్నగిల్లలేదు. దలైలామా టిబెట్ దేశం అధిపతి, పరిపాలకుడు, టిబెట్ బౌద్ధుల ధార్మిక గురువు. ఆయన టిబెట్ ప్రవాస ప్రభుత్వానికి 2006 వరకు అధినేత! కాని 2005లో దలైలామా టిబెట్‌ను చైనా నుంచి విముక్తం చేయాలన్న కార్యక్రమానికి స్వస్తి చెప్పాడు. బహిరంగంగా పలుసార్లు ప్రకటించాడు. మన హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల కేంద్రంగా పనిచేస్తున్న ఈ స్వతంత్ర టిబెట్ ప్రవాస ప్రభుత్వం వివిధ దేశాల్లోని టిబెట్ స్వాతంత్ర్య ఉద్యమకారులకు కేంద్ర బిందువు. దలైలామా చైనాకు అనుకూలంగా ప్రకటనలు చేస్తున్నప్పటికీ చైనా మాత్రం ఆయనను నిరం తరం నిందిస్తూనే ఉంది. 2008 నాటి ఒలిం పిక్ క్రీడల సందర్భంగా టిబెట్ ప్రజలు పెద్దఎత్తున తిరుగుబాటు చేశారు. చైనా ప్రభుత్వం అనేక మంది బౌద్ధ సంన్యాసులను చంపింది, వందల మందిని నిర్బంధించింది. పదేపదే చైనా ప్రభుత్వం టిబెటన్లపై పెద్దఎత్తున దమనకాండకు పూనుకొంటుంది.

**ఆధ్యాత్మికంగా భారతీయుడినన్న దలైలామా**

గుజరాత్‌లో 2010లో జరిగిన 'ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ కాన్ఫరెన్స్'లో ఆయన మాట్లాడుతూ పైకి కనిపిస్తున్న నా రూపం టిబెట్‌ది, ఆధ్యాత్మికంగా నేను భారతీయుడిని, భారత మాత పుత్రుడిని' అన్నారు.దలైలామాలంతా బుద్ధుని అంశ అయిన అవలోకేశ్వరుని పునర్జన్మలని బౌద్ధుల నమ్మకం. దలైలామా మరణిస్తే, మళ్ళీ ఇంకో చోట పుట్టి, మళ్ళీ దలైలామాగా పగ్గాలు చేపడతాడని బౌద్ధుల విశ్వాసం. మహాత్మా గాంధీ శాంతి మార్గంలో టిబెట్ స్వేచ్ఛ కోసం పోరాడుతున్న దలైలామాకి నోబెల్ శాంతి బహుమతి కూడా లభించింది.

**- పిన్నిటి బాలాజీ రావు**
9866776286

# స్నేహమే అభివృద్ధికి సోపానం

భారత్, నమీబియా దేశాలు పవిత్ర స్నేహంతో మెలగుతున్నాయి. నమీబియా గురించి టూకిగా. నమీబియా దేశాన్ని గతంలో నైరుతి ఆఫ్రికా అని పిలిచేవారు. ఇది నైరుతి ఆఫ్రికాలో అట్లాంటిక్ తీరంలో ఉంది. దీని రాజధాని వ్యవసాయం, వైద్యం, విద్యా రంగం మొదలగు రంగాలలో ముందుకు సాగుతాయని చెప్పారు. భారత్‌లో అంతరిస్తున్న 'చీతాలు' వాటి పునరుద్ధరణకు నమీబియా చక్కటి సహకారాన్ని అందించిందని 'చీతాలు' ఇచ్చినందుకు ప్రత్యేక



విండ్‌హాక్, కరెన్సీరాండ్, మాట్లాడే భాషలు ఆంగ్లం, మరియు ఆఫ్రికా జాతికి చెందిన ఒక భాష. మతం క్రైస్తవం. ఈ దేశంలో గిరిజనులు ఎక్కువ. ఈ దేశం వజ్రాలకు ఖ్యాతి గాంచింది. ప్రజల ప్రధాన వృత్తులు మత్స్య పరిశ్రమ, పశువుల పెంపకం. నమీబియా ప్రజలు ఎక్కువగా పశువుల పెంపకానికే ప్రాముఖ్యత ఇస్తారు. నాలుగు దేశాల పర్యటనలో భాగంగా మోదీ నమీబియా చేరుకున్నారు. అక్కడ నమీబియా అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్ ధైత్వ స్వాగతం పలికారు. మోదీ అక్కడ నుంచి నమీబియా పార్లమెంటు సభ్యులను కలిశారు. అక్కడ ప్రసంగిస్తు రెండు దేశాల లక్ష్యం సహకారం అందించుకోవాలని ప్రసంగించారు. నామీబియా అధ్యక్షురాలు నెటుంబో నమీబియా అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ అఫ్ ది మోస్ట్ ఎన్షియంట్ వెల్ విట్ షియా మిరబిలిస్' ప్రధాని మోదీకి అందించారు. ఇది మోదీకి 27వ పురస్కారం. 'వెల్ విటీషియా మిరాబిలిస్ అనేది ఎడారి మొక్క. వివిధ రంగాలలో కృషి చేసిన వారికి, నాయకత్వ లక్షణాలు ఉన్న వారికి ఈ పురస్కారం అందిస్తారు. మోదీకి ఈ పురస్కారం అందిస్తున్నప్పుడు అక్కడి పార్లమెంట్ సభ్యులు హర్షద్వానాలు చేశారు. మోదీ ప్రసంగిస్తూ నమీబియా, భారత్‌తో పలు ఒప్పందాలు చేసుకుంది. ఈ దిశలో రెండు దేశాలు కలసి కట్టుగా ఉండాలని రక్షణ, భద్రత, కృతజ్ఞతలు తెలుపుతున్నానని అక్కడి పార్లమెంటు సభ్యుల కరతాలధ్వనుల మధ్య ప్రకటించారు. నెటంబో మాట్లాడుతూ మోదీ సామాజిక, ఆర్థిక, అభివృద్ధికి కృషి చేశారాని పేర్కొన్నారు. రెండు దేశాలు పరస్పర సంబంధాలు పటిష్టం చేసుకోవాలని ఆకాంక్షించారు. భారత రాజ్యాంగం ఉన్నతమైనదని, భారత్‌లో ఓ గిరిజన మహిళా రాష్ట్రపతిగా ఉందని, అతి సామాన్యుడను అయిన నేను భారత ప్రధానిగా ఉన్నాను అంటే అది రాజ్యాంగ గొప్పతనమని, భారత రాజ్యాంగం గురించి గొప్పగా చెప్పారు. మోదీ, నెటుంబో తో చేతులు కలిపి మన సంస్క ృతి గొప్పదని, అలాగే మన సంబంధాలు కూడా కాల పరీక్షకు తట్టుకుని నిలబడ్డాయాని చెప్పడం గమనార్హం. మోదీ అక్కడి మత్స్య పరిశ్రమ అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. నమీబియా పౌరులు కష్టపడే తత్వం ఉన్న వాళ్ళని, వారి అధికఆదాయం పశువుల పెంపకం ద్వారానే వస్తోందని, అక్కడి ప్రజలు నిబద్దత కలవారని, నమీబియా సహకారం మాకు ముఖ్యమని, మన మధ్య ఉండాల్సింది పోటీ కాదు, సహాయ సహకారాలు అని చెప్పారు. ప్రధాని హోదాలో మోదీ నమీబియాకు వెళ్లడం ఇదే మెదటి సారి. అంతకు మునుపు ముగ్గురు భారత ప్రధానులు నమీబియా సందర్శించారు.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# అప్పటి రోజులే బాగుండేవి!



మా రోజుల్లో జీవితం ఎంతో బాగుండేది!- ఇది ప్రతి ఇంట్లో పెద్దలు పలికే మాట. కొన్నేళ్ల క్రితం దాన్ని విన్నప్పుడు చిరాకు పుట్టేది. ఎందుకంటే మనకు అది అప్పటి వారి ఆత్మాభిమానంగా అనిపించేది.

కానీ కాలంతో పాటే పరిస్థితులు మారినప్పుడు అదే మాట మన హృదయాల్లో మోగుతోంది. నిజంగా పాత రోజులే బాగుండేవి! ఆ రోజుల్లో జీవితం చాలా సాధారణం, కానీ హృదయాన్ని తాకేలా ఉండేది. ఉదయం పేపర్ తో తాతయ్య మెట్లపై, పాల కోసం బామ్మ పొరుగింటి వారితో ముచ్చట్లు, పిల్లలు చెట్ల కింద ఆడుకోవడం ,ఇవన్నీ ఒక ప్రకృతితో ముడి పడివున్న జీవన శైలి, ఆత్మీయతతో నిండిన అనుబంధాలను చూపించేవి. ఒకరినొకరు పిలుచుకునే బంధం, అభిమానం, మనసుల మమకారం ప్రతి రోజూ కనిపించేవి. ఈ జీవన విధానం లో స్వార్థం కన్నా ప్రేమ ఎక్కువ, కాలక్షేపం కన్నా కలసికట్టే ముఖ్యమైంది. సాంకేతికత దగ్గరయ్యే కొద్దీ మనిషికి మనిషి దూరమవుతున్నాడు

ఫోన్‌కి బానిసలుగా మారిన మనుషులు, పక్క వారితో మాట్లాడం మరిచి వాట్సాప్ గ్రూపుల్లో మాట్లాడుకోవడమే మిగిలింది. ఆత్మీయతను 'ఇన్బాక్స్'లో పెట్టేశాం, ప్రేమను 'స్టేటస్'గా మార్చేశాం. సెల్ఫీ కోసం నవ్వడం నేర్చుకున్నాం, కానీ మనిషి కోసం కన్నీరు పెట్టడం మాత్రం మర్చిపోయాం. సాంకేతికత అనేది ఒక సాధనం, జీవన మార్గం కాదు. మనిషి విలువలను దాని కోసం తాకట్టు పెట్టడం అమానవీయం. అప్పుడప్పుడు కూడా తాతయ్యల, అమ్మమ్మల ముఖం చూడడం కష్టమయ్యింది ఇప్పటి తరానికి పెద్దలు ఉన్నారో లేరో తెలియనంతలా తరం వేరు అయిపోయింది. వృద్ధాశ్రమాల్లో నవ్వే తాతలు ,ఇంట్లో ఒక మూల నిశ్శబ్దంగా ఉన్న బామ్మలు పతవనమవుతున్న మానవ సంబంధాలకు నిదర్శనాలు. అప్పట్లో ఇరుగు పొరుగు వారు కుటుంబ సభ్యులుగా ఉండే వారు కానీ ఇప్పుడు కుటుంబ సభ్యులే ఇరుగు పొరుగు వాళ్ళలా వుంటున్నారు. ఇక పెద్దలు చెప్పే జీవిత పాఠాలు నెట్‌లో టిప్స్ అయ్యాయి.

బామ్మ కథలు యూట్యూబ్‌లో కథలయ్యాయి. ఇల్లు అనే



మాట ఇప్పుడు గదిగా మిగిలింది. మనిషి ఉన్నా-బంధం లేదు. ఇది అభివృద్ధి కాదు పతనమవుతున్న మనిషికి ప్రతీక. మట్టి వాసనలు, తాటిచెట్ల గాలులు, మట్టికుండలో చల్లటి మజ్జిగ, ఇవన్నీ ఇప్పుడు కేవలం స్టేటస్లో ఫోటోల్లా మిగిలిపోయాయి. పిల్లలు ప్రకృతిలో ఆడటం లేదు ,మొబైల్ స్క్రీన్లో గేమ్లు ఆడుతున్నారు. మట్టి,చెట్టుతో చెలిమి లేదు, పోన్లు లాప్‌టాప్‌లతోనే సహవాసం చేస్తున్నారు.

ఒకప్పుడు మనిషి ప్రకృతిగా దగ్గరగా వుండేవాడు. ఇప్పుడు అతను ప్రకృతిని సెల్ఫీ బ్యాక్‌డ్రాప్‌గా మాత్రమే చూస్తున్నాడు. పల్లె జీవితం చివరికి ఊహల్లో మాత్రమే పరిమితమైందిగా మారింది. ఇది కలుషితమవుతున్న పల్లె వాతావరణానికి ప్రతీక. విద్యార్థులకు మానవ విలువలు,గౌరవం,బాధ్యతల పాఠాలు పుస్తకాల్లో మాత్రమే మిగిలాయి. వాస్తవ జీవితంలో అవి కనిపించడం అరుదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడం, సాయం చేసుకోవడంకన్నా,ఈర్ష్య, అసూయలతో పోటీ తత్వం ప్రధానమయ్యాయి. ఇవాళ్టి బాల్యాన్ని డబ్బుతో కొలుస్తున్నారు. బంధాలకు ధర పలికే ప్రయత్నం జరుగుతోంది. ఈ మార్పు సమాజాన్ని పతనం దిశగా మారుస్తుంది. ఒకప్పుడు వున్నది, తిన్నది తక్కువైనా అందరిలో ఆత్మ తృప్తి ఉండేది. ఇప్పుడు ఫైవ్ స్టార్ హోటల్లు ఉన్నా ఏదో తెలియ వెలితిలో వున్నారు. అప్పుడు ఆస్తి తక్కువగా ఉన్నా కలిసి మెలిసి అందరూ ఆనందంగా ఉండేవారు. ఇప్పుడు డబ్బు ఎంత ఎక్కువ ఉన్నా మనుషుల మధ్య దూరాలు పెరిగాయి. మనుషుల మధ్య గౌరవ మర్యాదలు తగ్గాయి. ఒకరిని ఒకరు నమ్మే గుణం పోయింది. స్నేహంపై స్వార్థం,ప్రేమపై అసూయ, బంధాలపై అపనమ్మకం పెరిగాయి. కాలంతో పాటు అందరి జీవితాల్లో మార్పులు రావాలి, అభివృద్ధి జరగాలి కానీ ఆ మార్పులు మానవత్వాన్ని చంపేలా కాకూడదు. ఈ తరం యువత పాత తరం కథలు వినాలి. పాఠాలు నేర్చుకోవాలి. బంధాలు పునర్నిర్మించాలి అనుబంధాల వెచ్చదనం తిరిగి తేవాలి. సమాజం అభివృద్ధి చెందాలి. కానీ అభివృద్ధికి మూలం బంధాలే కావాలి. ఆనందాన్ని ఇంటర్ నెట్ లో కాకుండా - ఆత్మీయుల మధ్య పంచుకోవాలి. పిల్లల మట్టిలో ఆటలాడాలి- ఫోన్‌లో కాదు. అప్పుడే మనిషిగా మిగిలే జీవితానికి అర్థం ఉంటుంది. అప్పుడే పాత తరం విలువలు కొత్త తరం జీవితానికి మార్గం చూపిస్తాయి. అప్పుడే పాత రోజులు మన హృదయాల్లో తిరిగి పుట్టుకొస్తాయి!

**- జి. అజయ్ కుమార్**

# కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ




**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కోరారు. నగరంలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ సెంటర్ లో సౌత్ ఇండియా ప్లాస్టిక్, ప్యాకేజింగ్, ప్రింటింగ్ ఎక్స్‌పోను రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ప్లాస్టిక్ ఉత్పత్తుల నిర్మూలనకు వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూమికి, పర్యావరణానికి హానికరం కాని ఉత్పత్తులను వినియోగించేలా ప్రచార కార్యక్రమాల సైతం నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలక అంశంగా మారిందన్నారు. నేడు మనం వాడుతున్న అనేక ఉత్పత్తులు ప్రకృతిని దెబ్బతీసే విధంగా తయారవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు మనం పర్యావరణానికి మేలు చేసే ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

పునర్వినియోగ, బయోడిగ్రేడబుల్ మరియు హానికారక రసాయనాలు లేని ఉత్పత్తులను ప్రోత్సహించడం వల్ల మట్టి, నీరు, గాలి కాలుష్యం తగ్గుతుందన్నారు. ఉదాహరణకు ప్లాస్టిక్ సంచీలకు బదులుగా జ్యూట్ బ్యాగులు, నైలాన్ బ్రష్లకు బదులుగా బ్యాంబు బ్రష్లు, రసాయన సబ్బుల స్థానంలో హెర్బల్ ఉత్పత్తులు వాడడం వల్ల మన ఆరోగ్యానికి, ప్రకృతికీ మేలు జరుగుతుందన్నారు. ఇటువంటి ఎక్స్పోల వల్ల ప్రజలలో అవగాహన మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ హిత ఉత్పత్తులను తయారు చేసేందుకు అవసరమైన యంత్ర పరికరాలతో కూడిన 80 స్టాల్స్ నగరంలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. నగరం చుట్టుపక్కల ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ ఎక్స్ పో ను సందర్శించి పర్యావరణహిత ఉత్పత్తులను తయారు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. పర్యావరణహిత ఉత్పత్తులకు ఆర్థిక సంస్థలు కూడా వేగంగా రుణాలు ఇస్తాయన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా బయోడిగ్రేడబుల్ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రకృతికి మేలు చేయడం అంటే మన జీవితానికి విలువ చేకూర్చడం అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకుని మనం ఎంచుకునే ప్రతి ఉత్పత్తిలో పర్యావరణ అనుకూలతను గుర్తించి, ప్రకృతిని పరిరక్షించేందుకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. మొక్కజొన్న, అరటి చెట్టు పీచు, కొబ్బరి బొండం ద్వారా లభించే పీచును సైతం పర్యావరణహిత ఉత్పత్తులకు అనుకూలంగా మార్చగలిగే యంత్ర పరికరాలు మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలోనే తయారు చేసేలా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, వ్యాపారవేత్త కాకాని తరుణ్, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. వి. స్వామి సహా పలువురు వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడుతున్న దుర్గగుడి





**విజయవాడ పశ్చిమ, జూలై 11 (మనం న్యూస్):** విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి శుక్రవారం వేకువ జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. పవిత్ర కృష్ణ నదిలో స్నానమాచరించి ఘాట్ రోడ్డు, మహా మండపం మీదగా కొండపైకి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. దుర్గమ్మ వారిని దర్శించుకుని భక్తులు తమ కోరికలు తీరిన నేపథ్యంలో వారి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మలగన్నయమ్మ కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి శుక్రవారం రోజున ఆషాఢ సారె సమర్పణ నిమిత్తం ఆలయం నకు వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులతో ఇంద్రకీలాద్రి కళ కళ లాడింది.ఇంటి ఆడపడుచుకు ఏ విధంగా సారె సంభారములు పెడతారో అంతకంటే ఎక్కువ భక్తి శ్రద్దలతో భక్త బృందాలు సామాగ్రి తో తరలి వచ్చారు. శుక్రవారం ఉదయం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ సుమారు 100 మందికి పైగా సభ్యులు గల బృందాలు విశేషరీతిలో విచ్చేశారు. మహా మండపం ఆరవ అంతస్తు వద్ద సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వహించి నారు. భక్తులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు ఆలయ అధికారులతో సిబ్బందితో ఈవో శీనా నాయక్ సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవో శీనా నాయక్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు ఎంతో భక్తితో అమ్మవారికి ఇస్తున్న సారె చీరలు అందుకు సంబంధించిన పూర్తి సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేయాలని ఈఓ శీనా నాయక్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇంద్రకీలాద్రి క్షేత్రంలో పాలనాపరమైన విధానాల్లో ఈవో ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు ఇచ్చే చీరలకు కంప్యూటర్లో నమోదు చేసి భద్రం చేయాలని ఎప్పటికప్పుడు సదరు నివేదికలకు కార్య నిర్వహణ అధికారికి తెలియజేయాలని ఆదేశించారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం 11 గంటల సమయానికి భక్తులతో ఇంద్రకీలాద్రి కిటికీలాడుతోంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్నారు.

## విజయవాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి చాక్లెట్లు



**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** రైల్వే పోలీస్ అధికారులతో కలిసి స్థానిక సత్యనారాయణపురం పోలీసులు వివిధ ప్లాట్ ఫారాల మీద శుక్రవారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన ఈ ఆకస్మిక తనిఖీల్లో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న రైళ్లలో గంజాయి చాక్లెట్లను గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ రత్నరాజు ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గంజా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. రైల్వే స్టేషన్ పరిధి ప్రాంతమైన సత్యనారాయణపురం స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు ఈ ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్నారు.

## దుర్గ గుడిలో జరుగుతున్న అభివృద్ధి పైన ఈవో సమీక్ష

**విజయవాడ పశ్చిమ, జూలై 11 (మనం న్యూస్):** దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ శుక్రవారం నాడు మహామండపంలోని 4వ అంతస్తులో ఉన్న తన చాంబర్ లో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజనీర్లు, కాంట్రాక్టర్స్, దాతలు హాజరయ్యారు. రాభోయే దసరా మహోత్సవాలను దృష్టిలో పెట్టుకుని జరుగుతున్న పనులు అన్నదానం భవన నిర్మాణం, లడ్డు పోటు భవనం, ఎలివేటేడ్ క్యూ కాంప్లెక్స్, హిల్ ప్రొటెక్షన్ పనులు, పూజ మందిరాలు, యాగశాల మొదలగు పనులు వేగవంతం చేయాలనీ ఆయన ఆలయ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు పై చర్చలు జరిపారు. మీటింగ్ అనంతరం పనులు జరుగు విధానంపై ఫీల్డు తనిఖీ చేశారు. ఈ



కార్యక్రమములో యాగశాల డోనార్ సంగా నరశింహ రావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, అన్ని రకాల పనులకు సంభందించిన కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## యజమానిని చంపి డబ్బు, నగలతో పనిమనిషి పరార్

**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** విజయవాడలో దారుణం జరిగింది. ఇంటి యజమానిని దారుణంగా హత్యచేసిన పని మనిషి, ఆపై ఇంట్లోని బంగారం, నగలతో పరారైంది. వివరాల్లోకెళితే.. బొద్దలూరి వెంకట రామారావు (70) తన తల్లి సరస్వతితో కలిసి మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్నారు. వృద్ధురాలైన తల్లిని చూసుకునేందుకు మూడు రోజుల క్రితం అనూష అనే పని మనిషిని పెట్టుకున్నారు. అనూష అదే ఇంట్లో వారితో కలిసి నివశిస్తుంది. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రామారావు గదిలో లైట్లు వెలిగి ఉండటంతో అనుమానం వచ్చిన సరస్వతి వచ్చి చూడగా కుమారుడు అపస్మారక స్థితిలో మంచంపై పడి ఉండటంతో తీవ్ర ఆందోళనకు గురయింది. మంచం మీద, రామారావుపై కారం చల్లి ఉండటాన్ని గమనించి, పని మనిషి అనూష కనిపించకపోవడం, బీరువా పగలగొట్టి ఉండటంతో పక్కింటి వారి సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో అనూషను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. నిందితురాలు తన భర్త సాయంతో రామారావు ముఖంపై దిండుపెట్టి ఊపిరాడకుండా చేసి చంపినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.





## సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ

**ఆదోని, జూలై 11: (మనం న్యూస్):** సుపరిపాలనకు ప్రతిరూపంగా తెరాసిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ఆదోని పట్టణంలోని 13వ వార్డు, కార్వాన్ పేటలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏసీ శ్రీకాంత్ రెడ్డి, ఎల్ఎల్సి చైర్మన్ రామస్వామి హాజరై, స్థానిక కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, సంక్షేమ పథకాల వివరాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చేర్చడమే ఈ ప్రచారం లక్ష్యం అని చెప్పారు. స్థానిక ప్రజల సమస్యలు, తలెత్తుతున్న అభ్యర్థనలను తెలుసుకొని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలతో చర్చిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తమకు అందుతున్నాయా లేదా అన్న అంశాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రతి కుటుంబానికి రాష్ట్రంలో నెలకొన్న సుపరిపాలనను వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, బూత్, కేఎస్ఎస్ సభ్యులు, పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వార్డులో ఈ కార్యక్రమం జోష్ భరితంగా కొనసాగింది.

## తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇస్తున్నాం



- ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు

**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** శుక్రవారం సాయంత్రం సెంట్రల్ నియోజకవర్గం లోని 59వ డివిజన్ సింగ్ నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో విజయవాడ సెంట్రల్ తెలుగుదేశం యువత సెంట్రల్ ఎస్సి సెల్, సెంట్రల్ మైనారిటీ సెల్ కమిటీల ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ అనంతరం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గం లో ప్రభుత్వ పరంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. క్రికెట్ నే కాకుండా అన్ని రకాల క్రీడా ఈవెంట్లను ప్రోత్సహిస్తామని తెలిపారు. క్రికెట్ పట్ల యువతలో ఎక్కువగా ఆసక్తి ఉందని, ఆసక్తిని గమనించి యువత ను క్రికెట్ క్రీడలో రాణించేందుకు క్షేత్రస్థాయిలో ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలియజేసారు.

## అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



**విజయవాడ సెంట్రల్, జూలై 11 (మనం న్యూస్):** అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ లగుడు గోవిందరావు విజయవాడ ప్రెస్ క్లబ్ లో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం ఉన్న బిసీలకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. బిసి సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు .ఈ నేపద్యంలో ఈ నెల21న ఢిల్లీ వేదికగా జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిసి సామాజిక వర్గానికి జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలని, బిసి సామాజిక వర్గాలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖను కేటాయించాలని, బిసిలపైన జరుగుతున్న దాడుల నేపద్యంలో బిసి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, బిపి మండల్ కమీషన్ సిఫార్సులను అమలు పరచాలనే డిమాండ్లతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. బిసిలందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# తమది ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం

- 20 ఏళ్లు తమ ప్రభుత్వం కొనసాగితే దేశంలోనే నెంబర్ వన్ స్టేట్గా ఏపీ
- ఎమ్మిగనూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్న మంత్రి టి.జి



**కర్నూలు జులై 11మనం న్యూస్:** పాదయాత్ర చేసి ముద్దులు పెడితే మరోసారి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వరని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని లక్ష్మీ నగర్లో ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమది మంచి ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వం కంటే వంద రెట్లు మంచిగా తమ పాలన ఉందన్నారు. మంచి పనులు ఇలాగే జరగాలంటే తమ ఎన్డీఏ ప్రభుత్వం మరో 20 సంవత్సరాలు ఇలాగే కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరి ఆశీస్సులు ఉంటేనే ఇది సాధ్యమవుతుందన్నారు. వైసీపీ నేతలకు విషప్రచారం చేయడం తప్ప ఇంకేమీ పని ఉండదన్నారు. సాక్షి పేపర్, ఛానల్లో ఏదో చూపిస్తూ తమపై తప్పుడు ప్రచారాలు చేస్తుంటారన్నారు. ఇంట్లో తల్లికి, చెల్లికి న్యాయం చేయని వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడో ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తమ నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పుడూ అభివృద్ధి గురించే ఆలోచిస్తారన్నారు. ఏడాది కాలంలో ఎన్నో మంచి పనులు చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నో రికార్డులు సాధించామన్నారు. ఇటీవల ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ నిర్వహించిన సర్వేలో పరిశ్రమల ఏర్పాటుకు, వ్యాపారాల నిర్వహణకు అత్యంత అనుకూల వాతావరణం ఉన్న రాష్ట్రాల్లో ఏపీకి 4వ స్థానం వచ్చిందన్నారు. 175 నియోజకవర్గాల్లో ఎం.ఎస్.ఎం.ఈ పార్కులు ఏర్పాటుచేసి స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇక ఎమ్మిగనూరు అభివృద్ధికి ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ చెప్పారు. ఇక్కడ ఎం.ఎస్.ఎం.ఈ పార్కు ఏర్పాటుచేయడం జరిగిందని.. దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. అంతేకాకుండా ఓర్వకల్లులో ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. దీనివల్ల ఈ ప్రాంతం యువత చదువులు పూర్తవ్వగానే ఇక్కడే ఉద్యోగాలు చేసేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లిన సమయంలో ప్రజలతో మాట్లాడుతూ.. తాము చెప్పినట్లుగా అధికారంలోకి రాగానే పింఛన్ పెంచి వెంటనే ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఐదేళ్లు పెంచి ఇవ్వలేదని ఆయన ప్రజలకు వివరించారు. సెలవు రోజు ఉంటే ఒక్కరోజు ముందుగానే పింఛన్ ఇవ్వాలన్న గొప్ప ఆలోచన సీఎం చంద్రబాబు నాయుడుకు వచ్చిందన్నారు. తల్లికివందనం డబ్బులు అకౌంట్లో పడ్డాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే నోట్ చేసుకొని పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు తెలిపారు.

## ఎస్ ఐ కి సన్మానం



మహానంది, జులై11,మనంన్యూస్. మహానంది మండలంలోని గాజులపల్లి గ్రామంలో జరిగిన పీర్ల పండుగ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించిన ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి ని గ్రామ ముస్లిం పెద్దలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మహానంది పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ముస్లిం మతపెద్దలు ఎస్ ఐ ని శాలువాతో సన్మానించారు.

# నా అరెస్టు వెనుక ఓ 70 ఏళ్ల పెద్దమనిషి వెనకుండి నడిపిస్తున్నారు

- రాజకీయ కుట్రతోనే నన్ను అరెస్ట్ చేశారు
- ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా తీసుకెళ్తా
- పలు సంచలన విషయాలను వెల్లడించిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



**నిజామాబాద్, జూలై 11 ( మనం బ్యూరో) :** నా అరెస్టు వెనుక ఓ 70 ఏళ్ల పెద్దమనిషి వెనకుండి నడిపిస్తున్నారని, రాజకీయ కుట్రలో భాగంగానే పేలుడు పదార్థాల కేసులో తనను అరెస్ట్ చేశారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అరెస్ట్ వెనక ఓ పెద్దమనిషి హస్తం ఉందని ఆరోపించారు. గురువారం రాత్రి బెయిల్ వచ్చిన తర్వాత శుక్రవారం తన కార్యాలయంలో చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సంచలన విషయాలను వెల్లడించారు. ఈ నెల 3న జిల్లా కేంద్రంలో లభించిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ కేసులో తన పేరు చేర్చారని తెలిసిందన్నారు. దీంతో ఈ నెల 5న సీఐ నరహరికి ఫోన్ చేసి శ్రీవారి వెంచర్ 18 ఎకరాలకు సంబంధించిన పత్రాలను పంపడం జరిగిందన్నారు. తన పేరుమీద ఇంచు భూమి కూడా లేదని సీఐకి తెలపగా తిరిగి రాత్రి 8 గంటలకు సీఐ తనకు ఫోన్ చేసి స్టేషన్కు వచ్చి కలవాలని చెప్పడంతో వెంటనే వెళ్లానని తెలిపారు. తాను వెళ్లేసరికి స్టేషన్లో ఏఎస్పీ చైతన్య రెడ్డి కూడా ఉన్నారని, ఏఎస్పీకి కూడా తన పేరున ఎలాంటి భూమి లేదని సంబంధిత పత్రాలు ఇవ్వడం జరిగిందని వివరించారు. రాత్రి 9 గంటలకు రూరల్ సీఐ రామన్ వచ్చి ఎస్పీ మీతో మాట్లాడుతారట వెళ్దామని చెప్పి ఓ ప్రైవేట్ వాహనంలో తనను ఎస్పీ కార్యాలయం వైపు కాకుండా నేరుగా హైవే వైపు మళ్లించారని చెప్పారు. ఇదే విషయాన్ని తాను సీఐని అడిగితే మళ్లీ వెంచర్కు సంబంధించిన ప్రశ్నలే అడిగితే సమాధానం చెప్పానన్నారు. తనను నేరుగా రాత్రి 12 గంటలకు బాన్సువాడ తీసుకెళ్లి ప్రాథమిక పాఠశాలలో కూర్చోబెట్టి మళ్లీ ప్రశ్నలు అడిగారని తెలిపారు. అక్కడి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అరెస్ట్ చేసి రిమాండ్ చేస్తున్నామని అప్పుడు చెప్పారన్నారు. రాత్రి 3 గంటలకు బిచ్కుంద జడ్జి వద్ద హాజరు పరిచారని, ఉదయం 6 గంటలకు నిజామాబాద్ సబ్ జైలుకు తీసుకెళ్లారని వివరించారు. ఈ మొత్తం వ్యవహారం రాజకీయ కుట్రతోనే జరిగిందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఓ మాజీ కౌన్సిలర్ తనపై దుష్ప్రచారం చేశారని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగానే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. రాత్రి 8 గంటలకు ఇంట్లో నుంచి తానే స్వయంగా పోలీసుల వద్దకు వెళ్లి పూర్తిగా వాళ్లతోనే ఉన్నానని, ఎఫ్ఐఆర్లో మాత్రం తాను తప్పించుకుని తిరుగుతున్నానని, అశోక్ నగర్ వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టుకున్నారని పొందుపరచడం ఎంతవరకు సమంజసమో పోలీసులు చెప్పాలన్నారు. నాలాంటి వారి పట్లనే పోలీసులు ఇలా ప్రవర్తిస్తే సామాన్య ప్రజల పట్ల ఎలా ఉంటారోనని అనుమానం వ్యక్తం చేశారు. అరెస్ట్ రోజు తనను తానుగా వచ్చానా.. ? పట్టుకుని అరెస్ట్ చేసారా పోలీసులు చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై భూమి లేదని తెలిసినా కేసులో చేర్చారన్నారు. తన అరెస్టు వెనుక ఓ 70 ఏళ్ల పెద్దమనిషి వెనకుండి నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా తీసుకెళ్లానని, పార్టీ తన పట్ల సానుకూలంగా ఉందన్నారు. తన ఎదుగుదలను ఓర్వలేక తన ప్రతిష్టకు భంగపరిచిన వారికి ప్రజలు, దేవుడు బుద్ధి చెప్తారని తెలిపారు. ఐపీఎస్ స్థాయి అధికారి తనపట్ల ఇలా వ్యవహరించడం సరికాదని, పోలీసుల వ్యవహార శైలిపై నేరుగా ఐజీకి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

# రాష్ట్ర జోనల్ మీట్లో కూడా ప్రతిభ చూపాలి

- కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర




**కామారెడ్డి క్రైం, జూలై 11 ( మనం న్యూస్) :** జిల్లా నుంచి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొన్న పోలీసులు రాష్ట్ర జోనల్ మీట్లోనూ ప్రతిభ చూపాలని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. పోలీస్డ్యూటీ మీట్లో జిల్లాపోలీసులు 11 పథకాలు సాధించిన సందర్భంగా శనివారం వారిని ఎస్పీ కార్యాలయంలో అభినందించారు. ఈనెల 7, 8 తేదీల్లో కరీంనగర్లో జరిగిన 2వ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్లో జిల్లా తరపున ఆరుగురు పోలీస్ అధికారులు 11 పతకాలు సాధించారు. గాంధారి ఎస్సై ఆంజనేయులు 5 పతకాలు సాధించారు. అందులో ( 3 బంగారు, 2 వెండి పతకాలు ) ఉన్నాయి. లిఫ్టింగ్, ప్యాకింగ్, ఫింగర్ ప్రింట్స్ ఫార్వర్డ్, నేర స్థల ఫోటోగ్రఫీ విభాగాల్లో బంగారు పతకాలు, విచారణలో శాస్త్రీయ వినియోగం (ఫింగర్ ప్రింట్ మరియు ఫోరెన్సిక్ సైన్స్) విభాగంలో వెండి పతకాలు సాధించారు. మద్నూర్ ఎస్సై విజయ్ ఫోరెన్సిక్, ఫోటోగ్రఫీ, ఫింగర్ ప్రింట్ సైన్స్ విభాగంలో రెండు వెండి పతకాలనుసాధించారు. బిచ్కుంద కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ దర్యాప్తు (రాత పరీక్ష), పోలీస్ పోర్ట్రెట్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. రాజంపేట కానిస్టేబుల్ చిరంజీవి కంప్యూటర్ అవగాహన విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఏఆర్ విభాగానికి చెందిన రామచంద్రం, ఎల్లారెడ్డిలు విధ్వంసకాల విచ్చిన్నంపై తనిఖీ విభాగంలో ఒక్కో వెండి పతకం సాధించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ., పోలీస్ అధికారులు, సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యం ఉన్న వారిని గుర్తించడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జోనల్ స్థాయిలో పతకాలు సాధించిన వారికి రాష్ట్ర స్థాయిలో, ఆ తర్వాత జాతీయ స్థాయిలో పోలీస్ డ్యూటీ మీట్ ఉంటుందని అందులో సైతం ప్రతిభ కనబర్చి జిల్లాకు మెడల్స్ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సాయుధ దళ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటిన పోచారం



**కామారెడ్డి, జూలై 11 ( మనంప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి, ఆకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'వన మహోత్సవం-2025' కార్యక్రమంలో భాగంగా గురువారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ., తెలంగాణ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 2 కోట్ల 75 లక్షల ఎకరాలు, ఈ ప్రకృతి మనకు అనుకూలంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలంటే వాతావరణం సమతుల్యంగా ఉండాలని, ఈ ప్రయత్నంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 18.02 కోట్ల మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఇందులో అత్యధికంగా పంచాయతీరాజ్ శాఖ 7 కోట్లు, పురపాలక శాఖ 8 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఈ మేరకు ఆయా శాఖలు, జిల్లాల వారీగా పలు లక్ష్యాల్ని నిర్దేశించిందని, అటవీ, వ్యవసాయ శాఖలు కూడా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. అందుకు గాను ప్రతి ఇంటికి ఆరు మొక్కలను ప్రభుత్వం నుండి పంపిణీ చేయనున్నారు. పంపిణీ చేసిన మొక్కలను విద్యార్థిని విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయ బృందం, అధికారులు, ప్రతి ఒక్కరు మొక్కలను నాటి ఈ వన మహోత్సవం-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి గారు, అటవీ శాఖ అధికారులు, బాన్సువాడ పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఊర పండుగకు రావాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్కు ఆహ్వానం



**నిజామాబాద్, జూలై 11 ( మనం న్యూస్) :** నగరంలో నిర్వహించనున్న ఊర పండుగకు రావాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ను సర్వ సమాజ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి ఆహ్వానం పలికారు. దీంతో ఆయన తప్పకుండా హాజరవుతానని చెప్పినట్లు సమాజ్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రామ్మూర్తి గంగాధర్, బంటు రాజేశ్వర్, రామడుగు బాలకిషన్, సకినాల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఊర పండుగను ఈ ఆదివారం నిర్వహించనున్నారు. ఊర పండుగను పురస్కరించుకొని నగరంలోని ఖిల్లా చౌరస్తా నుంచి గ్రామదేవతల ఊరేగింపును ప్రారంభించనున్నారు. పెద్దబజార్, ఆర్య సమాజ్, గోల్ హనుమాన్ మీదుగా వినాయక్ నగర్ వరకు గ్రామదేవతల ఊరేగింపు ఉంటుంది. అలాగే మరో గ్రామ దేవత దుబ్బ వైపు తరలి వెళ్తుంది. సర్వసమాజ్ సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు వేడుకలో పాల్గొననున్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం




**కామారెడ్డి, జూలై 11 ( మనం బ్యూరో) :** కామారెడ్డిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్, ఎం.హెచ్.ఎం.ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాధిక, వైద్యాధికారి డా.సాయి ఈశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.చంద్రశేఖర్, డి.ఎం.హెచ్.ఓ మాట్లాడుతూ., గర్భధారణ సమయ నిర్ణయం, సురక్షిత ప్రసవం గురించి చేపట్టవలసిన చర్యలు గురించి వివరించారు. కుటుంబ నియంత్రణ శాశ్వత పద్ధతులు, తాత్కాలిక పద్ధతుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నయీమ్ ఖాన్, సురేష్, నాగభూషణం, మోనిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# భారత్‌కు నష్టం కలిగిందనే ఒక్క ఆధారం చూపండి..

### జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సవాల్

**చెన్నై, జూలై 11 :** 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చెన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన డోభాల్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో




స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు.

సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను డోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే అత్యంత కచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ.. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని డోభాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు. పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థమంతంగా పేల్చివేశాయని తెలిపారు.

# బిలియన్ డాలర్ ట్రేడర్ నుంచి

- అధఃపాతాళానికి జెరోమ్ కెర్వియల్



**పారిస్, జూలై 11 :** 'ప్రపంచంలోనే అత్యంత పేదవాడు' అని ముద్ర పడింది. అలాగని మురికివాడల్లో నివసించడు. చిరిగిపోయిన దుస్తులు కట్టుకోడు. అతి సాధారణ మనిషిలా పారిస్ వీధుల్లో తిరుగుతుంటాడు. అతడే జెరోమ్ కెర్వియల్ . అనతి కాలంలోనే ప్రపంచ ట్రేడర్‌గా ఎదిగిన జెరోమ్ కెర్వియల్.. తను చేసిన తప్పిదంతో బిలియన్ డాలర్ ట్రేడర్ స్థాయి నుంచి అధఃపాతాళానికి పడిపోయారు. ఫ్రాన్స్‌లోని ప్రఖ్యాత బ్యాంక్ తరఫున అనధికార ట్రేడింగ్ చేస్తూ 7.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.4.95 లక్షల కోట్లు) కోల్పోయి దోషిగా నిలబడ్డారు. చివరికి ఇప్పుడు అతి సాధారణ జీవితం గడుపుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకు చోటు చేసుకున్న భారీ ఆర్థిక కుంభకోణాల్లో ఇదొకటి.

జెరోమ్ కెర్వియల్ 1977లో ఫ్రాన్స్‌లోని పోర్ట్-1 అబ్బేలో జన్మించారు. అతి సాధారణ కుటుంబం. తల్లి బ్యూటీపార్లర్లో పని చేసేవారు. తండ్రి ఇనుప పనిముట్లు తయారు చేస్తూ జీవనం సాగించేవారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుమారుడిని ఉన్నత చదువులు చదివించారు. ల్యూమియర్ యూనివర్సిటీ నుంచి కెర్వియల్ ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ సాధించారు. ఆ తర్వాత 2000 సంవత్సరంలో సొసైటీ జనరల్ అనే ట్రేడింగ్ సంస్థలో ఉద్యోగంలో చేరారు. జూనియర్ అయినప్పటికీ.. వ్యక్తిగత చొరవతో మెలకువలు నేర్చుకున్నారు. ట్రేడింగ్, ఐటీ సిస్టమ్స్‌పై పట్టు సాధించారు. దీంతో సులభంగా ట్రేడింగ్ చేసేవారు. యాజమాన్యం కూడా అతడికి కొంత స్వేచ్ఛ ఇచ్చింది. ఇదే అతడికి శాపంగా మారింది.

కెర్వియల్ 2006 - 2008 మధ్య కాలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పరిధికి మించి భారీ మొత్తంలో ట్రేడింగ్ చేశారు. వాటిని దాచి పెట్టేందుకు.. బ్యాంక్ సిస్టమ్‌లో తప్పుడు లావాదేవీలు సృష్టించాడు. ఒకానొక దశలో సొసైటీ జనరల్ సంస్థ మార్కెట్ మూలధనం కంటే 50 బిలియన్ యూరోలు ఎక్కువ మార్కెట్‌ను నిర్మించాడు. ప్రారంభంలో లాభాలు బాగానే వచ్చాయి. యాజమాన్యం కూడా అతడిని ప్రశంసించింది. అయితే, 2008 జనవరిలో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం మొదలైంది. దీంతో అతడి లావాదేవీలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. బ్యాంక్ అంతర్గత దర్యాప్తు ప్రారంభించింది. కెర్వియల్ అనధికారికంగా చేసిన ట్రేడింగ్ కారణంగా 4.9 బిలియన్ యూరోలను నష్టపోయినట్లు 2008, జనవరి 24న ఆ సంస్థ ప్రకటించింది.

సంస్థ కళ్లు గప్పి లావాదేవీలు నిర్వహించినందుకుగానూ, సంస్థ కంప్యూటర్లను అనధికారికంగా వినియోగించినందుకుగానూ పోలీసులు కెర్వియల్ను అరెస్టు చేశారు. అయితే, తన ట్రేడింగ్ గురించి యాజమాన్యానికి ముందే తెలుసని, లేదంటే లాభాలు వచ్చినప్పుడు మౌనంగా ఉండరు కదా? అని కెర్వియల్ వాదించారు. కావాలనే ఈ కుంభకోణంలో తనని ఇరికిస్తున్నారని వాపోయారు. పలుమార్లు విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ 2010లో తీర్పునిచ్చింది. అంతేకాకుండా ట్రేడింగ్‌లో కోల్పోయిన మొత్తాన్ని సంస్థకు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. దీంతో అతడు ప్రపంచంలోనే అత్యంత బీదవాడిగా మారిపోయాడు.

ప్రత్యేక పూచీకత్తుపై 2014లో విడుదలైన అతడు.. రోమ్ నుంచి పారిస్ వరకు 1300 కి.మీ పాదయాత్ర చేపట్టాడు. ఆర్థిక మార్కెట్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చేసిన తీర్థయాత్రగా దానిని అభివర్ణించాడు. క్రమంగా అతడిపై ప్రజల అభిప్రాయం కూడా మారడం మొదలైంది. ఈ కేసుపై విచారణ చేపట్టిన లేబర్ కోర్టు 2016లో అతడికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యోగంలో భాగంగానే అతడు ట్రేడింగ్ చేశాడని, పనిలో నుంచి తొలగించడం సమంజసం కాదని నమ్ముతూ.. 4.5 లక్షల యూరోల పరిహారం చెల్లించాలని సదరు సంస్థను ఆదేశించింది. మరోవైపు గతంలో 7.2 బిలియన్ డాలర్ల మొత్తాన్ని సంస్థకు కెర్వియల్ తిరిగి చెల్లించాలన్న కోర్టు ఆదేశాలను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. సొసైటీ జనరల్ ఆధ్వర్యంలోనే ఈ వ్యవహారం జరిగిందని స్పష్టం చేసింది. వాస్తవానికి 1 మిలియన్ యూరోలు మాత్రమే నష్టపోయినట్లు 2022లో సంస్థ మళ్లీ ప్రకటించింది. ఈ కేసు నుంచి బయటపడిన జెరోమ్ కెర్వియల్ ప్రస్తుతం ప్రశాంత జీవనాన్ని గడుపుతున్నారు. ఓ ఐటీ కన్సల్టింగ్ సంస్థలో పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

# మేం ప్రభుత్వ సంస్థల్ని స్థాపిస్తే.. వాళ్లు భూస్థాపితం చేస్తున్నారు

### ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే



**భువనేశ్వర్, జూలై 11:** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం నుంచి లౌకికవాదం, సామ్యవాద స్ఫూర్తిని తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భువనేశ్వర్‌లో శుక్రవారం నిర్వహించిన 'సంవిధాన్ బచావో' కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. బీజేపీ నాయకత్వంలో వ్యవస్థలు అతలాకుతలమయ్యాయని మండిపడ్డారు.

బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కుల్ని కాలరాస్తోందని దుయ్యబట్టారు. తమ హక్కుల కోసం దళితులు, ఆదివాసీలు, యువత ఎలా పోరాడాలో తెలుసుకోవాలన్నారు. ఒడిశాలోని ప్రభుత్వ అధికారులు, దళితులపై బీజేపీ మద్దతుదారులు దాడులకు దిగుతున్నారని, ఇది సరికాదని ఖర్గే హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో దేశవ్యాప్తంగా 160 ప్రభుత్వరంగ సంస్థల్ని ఏర్పాటు చేస్తే.. బీజేపీ ప్రభుత్వం వాటిలో 23 సంస్థల్ని ప్రైవేటీకరణ చేసిందని మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం పని చేయడం లేదని, ప్రైవేటు వ్యక్తులకు వత్తాసు పలుకుతోందని మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

# మంత్రి ఇంట్లో నోట్ల కట్టలు

**ముంబయి, జూలై 11 :** మహారాష్ట్రలో ఓ మంత్రి ఇంట్లో నోట్ల కట్టలు కలకలం సృష్టిస్తున్నాయి. ఆ మినిస్టర్ ఒకవైపు బెడ్ మీద కూర్చొని రిలాక్స్ అవుతుండగా.. మరొపక్క ఓ బ్యాగ్ కనిపించింది. అందులో కరెన్సీ నోట్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ దృశ్యాలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..? మహారాష్ట్రలో అధికార కూటమిలో భాగమైన శివసేన పార్టీ నేత సంజయ్ శిర్సాట్ చిక్కుల్లో పడ్డారు. 2019 నుంచి 2024 మధ్యలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తనకు ఆదాయపన్ను శాఖ నోటీసులు అందాయని తాజాగా వెల్లడించారు. అంతలోనే ఒక వీడియో వెలుగులోకి వచ్చింది. దీనిని శివసేన మరోవర్గం (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) నేత సంజయ్ రౌత్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. తన ఇంట్లో ప్రైవేట్ రూమ్‌లో కూర్చొని శిర్సాట్ పొగ పీల్చుతూ ఫోన్లో మాట్లాడుతూ కనిపించారు. ఆయన పక్కనే ఓ బ్యాగ్ ఉందని.. అందులో నోట్ల కట్టలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను చూస్తుంటే జాలేస్తుంది. తన పేరు గాల్లో కలిసిపోతుంటే ఇంకెన్నిసార్లు చూస్తూ ఉండిపోతారు..? నిస్సహాయతకు మరోపేరు ఫడ్నవీస్' అని తన పోస్టులో రౌత్ వ్యంగ్యంగా రాసుకొచ్చారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్నాథ్ శిండే నాయకత్వంలోని శివసేనకు చెందిన శిర్సాట్.. ఔరంగాబాద్ (వెస్ట్) నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం సామాజికన్యాయ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. తనకు ఆదాయపన్ను విభాగం నుంచి నోటీసులు అందాయని ధ్రువీకరిస్తూ నిన్న మీడియాతో మాట్లాడారు. "నాపై కొందరు ఫిర్యాదు చేయడంతో నోటీసులు అందాయి. వాటికి నేను తగిన వివరణ ఇస్తాను. నేనే తప్పు చేయలేదు'' అని వెల్లడించారు. అంతలోనే ఈ వీడియో వెలుగులోకి రావడం గమనార్హం. ఇదిలా ఉంటే.. తన పార్టీకి చెందిన నేతకు ఐటీ నోటీసులు అందిన సమయంలోనే ఏక్నాథ్ శిండే ముందుగా ఖరారుకాని ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. అక్కడ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారని వార్తలు వచ్చాయి. ఈ వీడియో క్లిప్‌పై శిర్సాట్ మాట్లాడుతూ 'ఆ దృశ్యాల్లో కనిపించింది మా ఇల్లే. అందులో నేను బెడ్రూంలో కూర్చున్నట్లుగా ఉంది. నా పెంపుడు శునకం, బ్యాగ్ కనిపించాయి. నేను కూర్చున్న తీరుచూస్తే.. ప్రయాణం ముగించుకొని వచ్చి, సేదతీరుతున్నానని ఎవరికైనా అర్థమవుతుంది. మీరన్నట్టు అది డబ్బుల బ్యాగ్ అయితే.. నాకు ఇంట్లో బీరువాలకు కొదవా..? దుస్తుల బ్యాగ్‌లో వారికి నోట్లు కనిపిస్తున్నాయి'' అని విమర్శలను తోసిపుచ్చారు.

# పాకిస్థాన్‌లో పంజా విసిరిన బలోచ్ రెబల్స్..!

## తొమ్మిది మంది కాల్చివేత

**ఇస్లామాబాద్, జూలై 11 :** పాకిస్థాన్‌లో బలోచ్ రెబల్స్ చెలరేగిపోతున్నారు. తాజాగా దక్షిణ బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పలు వాహనాలపై దాడి చేసి తొమ్మిది మందిని కాల్చి చంపారు. ముందుగా గురువారం సాయంత్రం పలు బస్సులను ఆపి వీరిని కిడ్నాప్ చేశారు. అనంతరం సమీపంలోని పర్వతాల్లోకి వారిని తీసుకెళ్లి హత్య చేసినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. అర్ధరాత్రి వారి మృతదేహాలు బయటపడినట్లు గవర్నమెంట్ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటివరకు ఏ గ్రూపు ఈ దాడికి బాధ్యత వహించలేదు. కానీ, ఈ ప్రాంతంలో గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడిన చరిత్ర బలోచ్ రెబల్స్‌కు ఉంది. ముఖ్యంగా పంజాబ్ ప్రావిన్స్ వారిని గుర్తించి మరీ కిడ్నాప్ చేశారు.

## పాకిస్థాన్‌పై 'ఆపరేషన్ బామ్'

బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పాక్ ప్రభుత్వంపై అతిపెద్ద దాడిని మంగళవారం ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ బామ్' అనే పేరు పెట్టింది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని చాలా జిల్లాల్లో ప్రభుత్వ, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసింది. దశాబ్దాల నాటి పోరాటంలో కొత్త అధ్యాయం మొదలైందని ఈసందర్భంగా ఆ సంస్థ పేర్కొంది. పంజ్‌గర్, సురబ్, కెచ్, ఖరన్ జిల్లాల్లో కలిపి 17 దాడులు నిర్వహించింది. వీటికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్లు, మిలిటరీ చెక్ పాయింట్లు ఉన్నాయి. ఈ ఘటనపై బీఎల్ఎఫ్ ప్రతినిధి మాట్లాడుతూ బలోచిస్థాన్ లిబరేషన్ వార్‌లో మరో సూర్యోదయం అయిందన్నారు. భద్రతా దళాల ఆయుధాలు, సిబ్బందిని లక్ష్యంగా చేసుకొన్నట్లు చెప్పారు.

# కర్నూలు కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

- పోలీసులు విద్యార్థి సంఘాల మధ్యతోపులాట
- ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలపై పోలీసుల జూలుం
- శాంతియుతంగా చేస్తున్న ధర్నాకు అడ్డుకట్ట వేస్తారా
- ఏఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్ట్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
- జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్



**కర్నూలు జూలై 11మనం న్యూస్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి సోమన్న అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ హాజరయ్యారు ఈ సందర్భంగా ఏఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జి ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ షాబీర్ భాష లు మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలపై ఘర్షణకు దిగిన పోలీస్ అధికారులు కూటమి ప్రభుత్వానికి పనిచేసిన పోలీస్ అధికారులు కాకి చొక్కాకు రాజీనామా చేసి కూటమి ప్రభుత్వ నాయకులకు పని చేసుకోండి అని హెచ్చరించారు అదేవిధంగా పెండింగ్లో ఉన్న 6400 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేసారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకి, తల్లిదండ్రులకి, యువగళం పాదయాత్రలో ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తుతూ మంత్రంగా కేవలం 600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు.

బడ్జెట్ సమావేశాల నాటికి ఈ రాష్ట్రంలో 3900 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం 2600 కోట్ల రూపాయలు కేటాయించిందని. కేటాయింపు కేటాయింపుగా ఉండిపోయింది తప్ప ఇంతవరకు ఒక్క విద్యార్థికి ఒక రూపాయి విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు కానందువలన విద్యార్థులు విద్యాసంస్థల యాజమాన్యాల వద్ద నుండి మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 6400కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు పీజీ విద్యను రచించడానికి శాపంగా మారిన జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకుపోయిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అరెస్టుకు నిరసనగా కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై కేటాయించిన విద్యార్థులు, అరెస్ట్ అయిన నాయకులను సొంత పూచికాపై విడుదల చేసిన పోలీసులు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, శరత్ కుమార్, దావూస్, ఉపాధ్యక్షులు, దస్తగిరి, వీరేష్,సిటీ అధ్యక్ష కార్యదర్శులు, అభి, అశోక్,నాయకులు, శేఖర్, అల్తాఫ్, శివ,మోహన్, వినోద్, హరీష్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం



- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

**తుగ్గలి, జులై 11(మనం న్యూస్) :** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన సాగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు.శుక్రవారం తుగ్గలి మండల పరిధిలోని పెండెకల్ గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బర్మా వీరేష్ నేతృత్వంలో 'సుపరిపాలన తొలి అడుగు'కార్యక్రమం ప్రారంభించారు.ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలుకరిస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమం పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాక, రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం,దీపం పథకం,ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంపు, అన్నా క్యాంటీన్లు పునరుద్ధరణ అమలు చేయడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.త్వరలో చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు వెంకటరాముడు చౌదరి, స్థానిక టీడీపీ నాయకులు ఓబులాప్ప, వెంకటేష్ మూర్తి,లక్ష్మి కాంత్,రాజు, హరి, కవీంద్ర, రాజశేఖర్, దామోదర్, వెంకటస్వామి, కొమ్ము వెంకటేష్, చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసులు గౌడ్, మసాలా శ్రీను, నాగరాజు, గుండమయ్య, మైరాముడు, డీలర్ తిమ్మప్ప, ఏడవలి తిమ్మప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల బాధ్యత కీలకం

- ప్రధానోపాధ్యాయులు కే. అరుణ జ్యోతి



**కౌతాళం, జూలై 11 (మనం న్యూస్) :** మండలంలోని బదినేహాల్ గ్రామంలో ప్రాథమిక కన్నడ పాఠశాల యందు మెగా పేటియం విజయవంతంగా జరిగింది. ఇందులో బాగంగా విద్యార్థుల యొక్క తల్లి తండ్రులు విద్యార్థులు మరియు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని మెగా పేటియం కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ముందుగా విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు అందరూ కలిసి ప్రజా ప్రతినిధులను మరియు తల్లి తండ్రులను పుష్పా గుచ్చలాతో ఆహ్వానం పలికి స్వాగతం పలికారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో మరియు ఇంగ్లీష్ సంభాషణతో తమ తల్లి తండ్రులను మెప్పించడం జరిగింది. అలాగే తల్లి తండ్రులకు ఆటలు ఆడిపించి బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా ప్రధాన ఉపాధ్యాయురాలు కే.అరుణ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల యొక్క బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు పాత్ర కీలకమని అన్నారు. తల్లిదండ్రులు పాఠశాల వైపు ఒక అడుగు వేసి వాళ్ళ భవిష్యత్తుకు భాగస్తులుగా ఉండి వాళ్ళ పిల్లల యొక్క బంగారం భవిష్యత్తుకు పునాది వేయడానికి ఒక అడుగు ముందుకు వెయ్యాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరేష్, అంబ్రెష్ మరియు నాయకులు నరసింహులు, షేక్షవాలి, షబ్బీర్, ఆలాం, సాయిబాన్న, అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మారుతీ ఫ్యాక్టరీలో ఉద్యోగుల తొలగింపు అక్రమం

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- స్థానిక ఉద్యోగులను తొలగించడమే యాజమాన్య ధ్యేయం
- మారుతి ఇస్పాత్ ఎనర్జీ ఫ్యాక్టరీ ముందు ఉద్యోగుల ధర్నా
- సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు



**మంత్రాలయం, జూలై 11(మనం న్యూస్) :** మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామం సమీపాన ఉన్న మారుతి ఇస్పాత్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులను తొలగించడం అక్రమమని, రాజశేఖర్, టిప్పు సుల్తాన్ ప్రభాకర్ గౌస్ హనుమయ్య స్వామి ఫరీద్ వినోద్ తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం మారుతి ఫ్యాక్టరీ ముందు తొలగించబడిన ఉద్యోగులతో పాటు వారికి మద్దతుగా సుమారు 100 మంది కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో ఫ్యాక్టరీ స్థాపించేటప్పుడు స్థానికులకు 75% ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని ,ప్రభుత్వ నిబంధనలు కూడా ఉన్నాయని తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం అవేవీ పట్టించుకోకుండా దూర ప్రాంతాల నుంచి వేరే రాష్ట్రాల నుంచి ఉద్యోగస్తులను తీసుకుంటుందని ఆరోపించారు. ఫ్యాక్టరీ స్థాపించేటప్పుడు చుట్టుపక్కల గ్రామాల పొలాలను తీసుకున్నారు . చుట్టుపక్కల ఉన్న పంట పొలాల రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని, ఏదో కొంతమందికి మాత్రమే తూతూ మంత్రంగా చెల్లిస్తున్నారని చుట్టుపక్కల రైతులు మండిపడుతున్నారు. ఆయా గ్రామ ప్రజలకు ఫ్యాక్టరీల్లో ఉద్యోగం కల్పిస్తామని నమ్మబలికారు. ఇప్పుడు మాత్రం అవేమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఫ్యాక్టరీ యాజమాన్యం తరపున విద్యా, వైద్యం,తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తామని నిబంధనలో తెలిపారు కానీ అవేవీ కల్పించడం లేదని ఆయా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉద్యోగాలు నుంచి తమను తొలగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆత్మహత్యలే శరణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో జీతాలు కూడా పనికి తగ్గ వేతనం చెల్లించడం లేదని వాపోయారు. తమకు న్యాయం జరగకపోతే మరిన్ని పోరాటాలు చేస్తామని ఉద్యోగులు యాజమాన్యాన న్ని హెచ్చరించారు. సమాచారం అందుకున్న మాధవరం ఎస్సై విజయ్ కుమార్ మంత్రాలయం ఎస్సై శివాంజులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.స్థానిక నాయకులతో తొలగించిన ఉద్యోగులపై వత్తిడి తెచ్చి మీ సమస్యను పరిష్కరిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం నాయకులతో ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తుంది. గతంలో కూడా ఫ్యాక్టరీ స్థాపించేటప్పుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు స్పష్టమైన హామీలు ఇచ్చిన ఇంతవరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ఫ్యాక్టరీల్లో ప్రతిసారి ఏదో ఒక రూపంలో సమస్యలు తలెత్తినప్పుడు నాయకులు చోక్యంతో సద్దుమణుకుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చుట్టుప్రక్కల గ్రామస్తులు కోరుతున్నారు.

# గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- వినాయక ఉత్సవ సమితి జిల్లా కార్యదర్శి గోవర్ధన్ నాయుడు



**పత్తికొండ, జూలై 11(మనం న్యూస్ ) :** ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే గణేష్ ఉత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అన్ని మండలాలు, గ్రామాల పరిధిలోని నిర్వాహకులు సన్నద్ధం కావాలని కర్నూలు జిల్లా శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శి గోవర్ధన్ నాయుడు కోరారు. శుక్రవారం ఆయన పత్తికొండలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 27వ తేదీన జరిగే వినాయక చవితి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ సమితి నిర్వాహకులు సిద్ధం కావాలని కోరారు. మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతి, కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.చివరి ఘట్టమైన వినాయక నిమజ్జన వేడుకలో ఎక్కడా అపశృతి జరగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సూచన మేరకు ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు ఉత్సవ మండపాల నిర్వాహకులు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన టిడిపి నేత మనోహర్ చౌదరి

- ఎన్టీఆర్ విగ్రహా ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వినతి

**తుగ్గలి, జులై 11 (మనం న్యూస్) :** మండలం పరిధిలోనే రాతన గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక



రామారావు విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ను తెలుగుదేశం పార్టీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ పి.మనోహర్ చౌదరి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.మనోహర్ చౌదరి మాట్లాడుతూ రాతన గ్రామంలో ప్రజల కోరిక మేరకు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.అందుకు ఎమ్మెల్యే కే.ఇ శ్యామ్ కుమార్ లెటర్ ద్వారా తాము జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే రాతన గ్రామంలో నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు అనుమతి లెటర్ పంపుతానని తెలిపారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు,విద్యార్థులు



**కౌతాళం జూలై 11 మనం న్యూస్ :** కౌతాళం మండల పరిధిలోని ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అందరు ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు సంక్షేమానికి ఎంత గానో కృషి చేశారని వారు చేసిన సేవలను ఘనంగా కొని యాడారు. పాఠశాలలో సుదీర్ఘకాలం పనిచేసిన సన్మానం చేస్తున్న సందర్భంలో విద్యార్థులు ఉద్వేగాన్ని ఆపుకోలేక వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ దేవనకొండ మండల కార్యదర్శిగా ఎం. నరసరావు

**దేవనకొండ, జులై 11( మనం ప్రతినిధి) :** భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) ఆలూరు నియోజవర్గ 12వ మహాసభల్లో సిపిఐ దేవనకొండ మండల కార్యదర్శిగా ఎం నరసరావును ి తిరిగి ఎన్నుకున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె



మద్దిలేటి శెట్టి తెలిపారు. శుక్రవారం ఆలూరులో నిర్వహించిన మహాసభల్లో మండల సహాయ కార్యదర్శిగా నల్ల చెలిమి లకు చెందిన సి బజారి, తో పాటు 32 మందిని కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవం ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ఉద్యమాలు చేపడుతుందన్నారు. అలాగే యువతకు విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ)ఆధ్వర్యంలో మండల ప్రజానీకం,రైతాంగం తరపున,పాలక ప్రభుత్వాలపై భవిష్యత్తు పోరాటాల నిమిత్తం పలు తీర్మానాలు రూపొందించినట్లు వారు తెలిపారు.

## మహానంది లో జడ్జి పూజలు

**మహానంది, జులై11,మనంన్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రం లో కర్నూలు జిల్లా నాలుగవ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి లీలావతి పూజలు నిర్వహించారు. శుక్రవారం మహానందికి వచ్చిన వారికి ఆలయ ముఖమండపం వద్ద అర్చకులు, టెంపుల్ ఇన్స్పెక్టర్,ఇంఛార్జి సూపర్డెంట్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం కళ్యాణ మండపంలో వేదపండితులు శాంతారామ్ బట్ వేదమంత్రోచ్చారణ మధ్య ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



## సుంకులమ్మకు బోనాలు సమర్పణ


**మహానంది, జులై11 (మనంన్యూస్) :** మహానంది గ్రామంలోని ఈశ్వర్ నగర్ కాలనిలో వెలసిన శ్రీ సుంకులమ్మ అమ్మవారికి ఆషాడ



మాసం సందర్భంగా సారె, బోనాలను అందజేశారు. శుక్రవారం మహానంది దేవస్థానానికి చెందిన మహిళలు ముందుగా బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం సుంకులమ్మ ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## టిడిపిలోకి చేరిన వైసీపీ కార్యకర్తలు

**మంత్రాలయం , జూలై 11,మనం న్యూస్ :** మంత్రాలయం గ్రామానికి చెందిన రవి , విరుపాక్షి , గోవిందు , వెంకటేష్ , వడ్డే రవి , లక్ష్మన్న , సిద్దూ , నవీన్ , గురురాజ్ , మరో నలుగురు వైసీపీ కార్యకర్తలు



శుక్రవారం టిడిపిలోకి చేరారు. వీరికి మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏళ్ల తరబడి వైసీపీ పార్టీ కోసం పనిచేసినప్పటికీ అండదండలు కరువయ్యాయని ,అందువల్ల టిడిపి ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి తమకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చినందుకు టిడిపి పార్టీలోకి చేరుతున్నట్లుగా కొత్తగా పార్టీలోకి వచ్చిన కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టిడిపి టౌన్ ఇన్చార్జి వరదరాజులు, ఎంపీటీసీ నక్కి వెంకటేశ్ , టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి , పవన్ కుమార్ ,రాఘవేంద్ర , శివ కుమార్ , తదితరులు ఉన్నారు.

## అన్నదానం గొప్పది



- హనుమంతరావు చౌదరి

**కర్నూల్ జులై 11 (మనం న్యూస్) :** శుక్రవారం నిరాశ్రయులకు పి,హనుమంతరావు చౌదరి పి,లక్ష్మీ పద్మా చౌదరి దంపతులు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెళ్లిరోజు సందర్భంగా ఉదయమున వెంకటరమణ కాలనీ లో వెలసిన వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి ఆ స్వామి ఆశీర్వాదం తీసుకుని రైల్వే స్టేషన్ ఎదురుగా నీళ్ల ట్యాంకు దగ్గర ఉన్న నిరాశ్రయులకు అన్న ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగరికలోకంలో విదేశీయుల, అలవాట్లు, కొరవడి కేకు కటింగ్ లాంటివి లేకుండా సాదాసీదాగా పేద బీద సాదా వారితో కలిసి వారి బాధలు తెలుసుకొని మనము మన సంప్రదాయాలను కొనసాగించాలని ప్రతి ఒక్కరు కూడా పుట్టినరోజు, పెళ్లిరోజు, ఏదైనా విశేషమైన, రోజు ఉంటే, పేదలకు ఏదైనా సహాయం చేస్తే, వారి కళ్ళలో ఆనందం, వారి ఆశీర్వాదం, మనకు, ఉంటుందని భావితరాలవారికి మన సంస్కృతి సాంప్రదాయాలు, తల్లిదండ్రి, తాత అవ్వ, అత్త మామ ,లాంటి సాంప్రదాయ, కుటుంబాలు సమసి, పోతున్నాయి ఉమ్మడి కుటుంబాలు, ముక్కలవుతున్నాయి, కుటుంబంలో ఇమడలేక, పెద్దలను అనాథ ఆశ్రమాలలో వదులుతున్నారు వారి జీవితాలను త్యాగం చేసి మనకు జన్మనిచ్చి, పోషించి, బుద్ధులు, నేర్పించి, పెద్దవాళ్ళను చేస్తే, మనం వాళ్లని విస్మరించడం, వలన, దేవుడు క్షమించడు అందువలన ప్రతి ఒక్కరము, పేదలతో, గడపడం మన పెద్దలను చేర తీద్దాం, వారి బాధలను పంచుకుందామని వరించారు.

మనం

8 SPORTS

# స్పోర్ట్స్

Manam Sports, Cinema

గుంటూరు - శనివారం 12 జూలై 2025

## మనం హాలీడేకు రాలేదు.. దేశం కోసం వచ్చాం : గౌతమ్ గంభీర్

గత ఆసీస్ పర్యటనలో టీమ్ఇండియా ఘోర పరాభవం చూవిచూసింది. దీంతో ఆటగాళ్లతోపాటు సిబ్బంది విషయంలో బీసీసీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. వీటిపై కోహ్లీ వంటి సీనియర్ కాస్త అసహనం వ్యక్తంచేశాడు. కుటుంబసభ్యులతో కాకుండా జట్టుతోనే ప్రయాణం చేయాల్సి ఉండటం అందులో ముఖ్యమైంది. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎక్కువ సమయం కుటుంబానికి కాకుండా ఆటకే కేటాయించాలని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. దీనికి ముందు తన తల్లి అనారోగ్యం దృష్ట్యా గంభీర్ కూడా స్వదేశానికి వచ్చి మళ్లీ వెంటనే ఇంగ్లాండ్ కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బీసీసీఐ నిబంధనలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఛెతేశ్వర్ పుజారాతో ముఖాముఖిలో గంభీర్ తన అభిప్రాయాలను వెల్లడించాడు. ''ప్రతిఒక్కరికీ కుటుంబాలు చాలా ముఖ్యమే. ఇక్కడ ఓ విషయం అర్థం చేసుకోవాలి. మనం ఇక్కడికి వచ్చిన కారణం వేరు. ఇదేమీ హాలీడే కాదు. ఏదైనా పర్యటనకు వెళ్లినప్పుడు డ్రెస్సింగ్ రూమ్ లో చాలా తక్కువమందితో ఉండాల్సి ఉంటుంది. వారితో పనిచేసి దేశం గర్వపడేలా చేయాలి. మాతో కుటుంబాలు ఉండకపోవడానికి వ్యతిరేకం కాదు. ఫ్యామిలీకి సమయం కేటాయించాలి. అదే సమయంలో దేశం కోసం ఆడేందుకు వచ్చినప్పుడు మన దృష్టి ఇక్కడే ఉండాలి. ఆ లక్ష్యానికి కట్టుబడి ఉండాలి. ఇప్పుడంతా బాగానే ఉందనుకుంటున్నా. నావరకైతే ఇతర విషయాల కంటే నాకు ఈ లక్ష్యమే ఎక్కువ'' అని గంభీర్ వ్యాఖ్యానించాడు. గతంలో విరాట్ కోహ్లీ మాత్రం విభిన్నంగా స్పందించాడు. దీనివల్లే అతడు టెస్టు కెరీర్ ను త్వరగా ముగించి ఉంటాడని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

''నాతోపాటు ఎవరైనా సరే నేర్చుకోవాల్సిందే. మెరుగవ్వాలి. పోటీపడాలి. ప్రతిరోజూ మనకు పోరాటమే. మూడు రంగుల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు తప్పదు. ఇక్కడ గంభీర్ ముఖ్యం కాదు. భారత క్రికెట్ కే ప్రాధాన్యం. ప్రతిఒక్కరికీ తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. డ్రెస్సింగ్ రూమ్ కల్చర్ గురించి మాట్లాడుకోవచ్చు. నాకు ప్రతిఒక్కరి ఒపీనియన్ ముఖ్యమే. మన విజయంలో కుటుంబ పాత్ర చాలా ఎక్కువ'' అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



## అమ్మాయిలు అదరగొట్టేశారు

అదిరిపోయే ఫామ్లో ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఇంగ్లాండ్ గడ్డపై చరిత్ర సృష్టించారు. టీ20లో ఆ జట్టుపై భారత్ తొలిసారి సిరీస్ విజయాన్ని అందుకుంది. బుధవారం నాలుగో టీ20లో ఆరు వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. మరో మ్యాచ్ మిగిలివుండగానే 3-1తో సిరీస్ ను కైవసం చేసుకుంది. 2006లో డెర్బీలో జరిగిన ఏకైక టీ20 మ్యాచ్ లో ఇంగ్లాండ్ పై భారత్ పైచేయి సాధించింది. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఇంటా, బయటా ఇంగ్లాండ్ పై భారత్ సిరీస్ నెగ్గలేకపోయింది. ప్రస్తుత పర్యటనలో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తాచాటడంతో అలవోకగా సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. భారత బౌలర్ల దెబ్బకు 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 126 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ సోఫియా డంక్లీ (22; 19 బంతుల్లో 2X4, 1X6) టాప్ స్కోరర్. సిరీస్ లో భారత విజయాల్లో కీలకంగా మారిన తెలుగమ్మాయి శ్రీచరణి (2/30) మరోసారి విజృంభించింది. రాధ యాదవ్ (2/15), అమన్ జ్యోత్ కౌర్ (1/20), దీప్తిశర్మ (1/29) కూడా సత్తాచాటడంతో ఇంగ్లాండ్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. స్మృతి మంధానా (32; 31 బంతుల్లో 5X4), షెఫాలీ వర్మ (31; 19 బంతుల్లో 6X4), జెమీమా రోడ్రిగ్స్ (24 నాటౌట్; 22 బంతుల్లో 1X4), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (26; 25 బంతుల్లో 3X4) రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. సిరీస్ లో ఆఖరి టీ20 శనివారం జరుగుతుంది. సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: 126/7 (సోఫియా డంక్లీ 22, అలిస్ క్యాప్సీ 18, టామీ బ్యూమాంట్ 20, శ్రీచరణి 2/30, రాధ యాదవ్ 2/15), భారత్ ఇన్నింగ్స్: 17 ఓవర్లలో 127/4 (స్మృతి 32, షెఫాలీ 31, జెమీమా 24 నాటౌట్, హర్మన్ప్రీత్ 26).



## ఆ ఇద్దరి సూచనలు భలేగా పనిచేశాయ్ : నితీశ్

లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ - భారత జట్ల మధ్య మూడో టెస్టు జరుగుతోంది. తొలి నుంచీ నెమ్మదిగా ఆడిన ఇంగ్లాండ్ ను తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి దెబ్బకొట్టాడు. ఒకే ఓవర్ లో రెండు వికెట్లు తీసి భారత్ కు బ్రేక్ అందించాడు. ఓవైపు బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ వేసినా వికెట్ మాత్రం త్వరగా రాలేదు. నితీశ్ మాత్రం పదునైన పేస్, స్వింగ్ తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఇబ్బందిపెట్టాడు. అయితే, తన ప్రదర్శన వెనక ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్, భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పాత్ర ఉందని నితీశ్ వెల్లడించాడు. కమిన్స్ సన్ రైజర్స్ హైదరాబాద్ సారథిగా వచ్చినప్పటి నుంచి నితీశ్ కు మంచి అవకాశాలు ఇచ్చాడు.

''గత ఆస్ట్రేలియా పర్యటన అనంతరం నా బౌలింగ్ లో మరింత నాణ్యత అవసరమని భావించా. నిలకడగా బంతులేయడంపై దృష్టి పెట్టా. ఆ తర్వాత ఐపీఎల్ లో పాట్ కమిన్స్ నాయకత్వంలో ఆడా. ఆసీస్ తరఫున ఎన్నో అద్భుతాలు చేశాడు. అతడిని పదేపదే టిప్స్ అడిగేవాడిని. కమిన్స్ కూడా చాలా బాగా సూచనలు ఇచ్చేవాడు. ఆసీస్ కు ఇంగ్లాండ్ కు మధ్య వ్యత్యాసం ఏంటనేది అడిగా. ఎందుకంటే రెండు దేశాల్లోనూ కమిన్స్ కు చాలా మంచి ప్రదర్శనలు చేసిన అనుభవం ఉంది. ఇప్పుడు నాకు ఇంగ్లాండ్ టూర్ మొదటిది. అందుకే, అతడి సలహాలు తీసుకున్నా. 'ఆసీస్, ఇంగ్లాండ్ పిచ్ ల్లో పెద్దగా మార్పులుండవు. అయితే, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆటను మార్చుకుంటూ ఉండాలి. ఎంత వీలైతే అంత నేర్చుకుని ముందుకుసాగాలి' అని చెప్పాడు. ఆ సూచనలు ఇప్పుడు బాగా పనిచేశాయి'' అని నితీశ్ వెల్లడించాడు.

**మోర్నీ అద్భుతం..**

''నేను ఈ పర్యటన నుంచి మోర్నీ మోర్కెల్ తో కలిసి పనిచేస్తున్నా. అతడితో వర్క్ చేస్తుండటం భలేగా ఉంటుంది. గత రెండు వారాలుగా బౌలింగ్ లోనూ చాలా కష్టపడ్డా. ప్రోగ్రెస్ కనిపించింది. నిలకడగా బంతులేయడంపై ఎక్కువగా దృష్టిపెట్టా. ఇప్పుడే కాదు గత రెండేళ్లుగా దీనిపై సాధన చేస్తూనే ఉన్నా. ఆత్మవిశ్వాసంతో ఉంటే ఏదొక సమయంలో ఫలితం సానుకూలంగా వస్తుందని తెలుసు'' అని నితీశ్ వ్యాఖ్యానించాడు.

## 'రామాయణ'.. హనుమంతుడి పాత్ర 15 నిమిషాలే!

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ దేవోల్ కనిపించనున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్టులుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉండనున్నట్లు సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. రెండో భాగంలో ఆయన పాత్రే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. పార్ట్ 2లో ఎక్కువసేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఇందులో రాముడి పాత్రలో రణ్ బీర్



కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. జటాయువు పాత్రకు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నట్లు సమాచారం. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా మొదటిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. రెండో భాగం 2027లో విడుదల కానుంది.



## పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ వచ్చేసింది

సూపర్ స్టార్ రజినీకాంత్ లేటెస్ట్ మూవీ 'కూలీ'. ఇదివరకే చికిటు అనే పాట రిలీజ్ కాగా.. ఇప్పుడు మోనికా అంటూ సాగే రెండో సాంగ్ రిలీజ్ చేశారు. పూజా హెగ్డే చేసిన స్పెషల్ పాట ఇది. రెడ్ కలర్ డ్రస్సుల్లో గ్లామర్ చూపిస్తూ పూజ డ్యాన్స్ బాగానే చేసింది. కాకపోతే అనిరుధ్ గతంలో కంపోజ్ చేసిన సాంగ్స్ లా ఇదేం ప్రత్యేకంగా అనిపించలేదు. కాకపోతే కలర్ ఫుల్ గానే ఉంది. ఈ పాటని వైజాగ్ పోర్ట్ లో తీసినట్లు తెలుస్తోంది. పూజా హెగ్డేతో పాటు సౌబిన్ షాహిర్ డ్యాన్సులు వేస్తూ కనిపించాడు. ఇదే గీతంలో విలన్ పాత్ర చేస్తున్న నాగార్జున కూడా స్టెప్పులేశాడు. కాకపోతే ఆ విజువల్స్.. లిరికల్ వీడియోలో పెట్టలేదు. థియేటర్లలో అవి ఉంటాయని తెలుస్తోంది. ఆగస్టు 14న థియేటర్లలోకి రానున్న 'కూలీ'లో రజినీతో పాటు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్, ఆమిర్ ఖాన్.. ఇలా స్టార్స్ బోలెడంత మంది ఉన్నారు. హైప్ కూడా గట్టిగానే ఉంది.



## తమిళ దర్శకుడితో చైతు.. ఇదిగో క్లారిటీ

అక్కినేని హీరో నాగచైతన్య ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ తీస్తున్న ఓ సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైంది. మరోవైపు నెక్స్ట్ ఏం మూవీ చేస్తాడా అని ఇప్పటినుంచే కొన్నిపేర్లు వినిపిస్తున్నాయి. వాటిలో తమిళ దర్శకుడు మిత్రన్ పేరు కూడా ఉంది. అయితే ఇప్పుడు వినిపిస్తున్న రూమర్లపై ఓ క్లారిటీ కూడా వచ్చేసింది. తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్-నాగచైతన్య కాంబినేషన్ లో ఓ స్పై డ్రామా సినిమా తీసేందుకు సన్నాహాలు మొదలయ్యాయని కోలీవుడ్ నుంచి సమాచారం వచ్చింది. అయితే చైతూ సన్నిహితులు చెబుతున్న దాని ప్రకారం అలాంటివే లేవని తెలుస్తోంది. తమిళంలో 'ఇరంబుదురై' (తెలుగులో 'అభిమన్యుడు'), 'సర్దార్' లాంటి హిట్ సినిమాలను తీసిన దర్శకుడు పీఎస్ మిత్రన్. ఒకవేళ ఈయనతో చైతూ సినిమా చేస్తే బాగానే ఉంటుంది. మరి భవిష్యత్తులో కాంబో సెట్ అవుతుందేమో చూడాలి.



తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకుంటుంటారు నటి శ్రుతి హాసన్. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఈమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన

## పెళ్లి అంటేనే భయం: శ్రుతి హాసన్

కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. శ్రుతి పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

**ఓ కాగితంతో ముడిపెట్టడం.. భయానకం**

''నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవిత కాలపు బాధ్యత''

**తొలి విజయం 'గబ్బర్ సింగ్'తోనే...**

''పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలేనన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది''

**ఎవరి ప్రత్యేకతలు వారికే....**

''మా నాన్న కమల్ హాసన్, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టి కోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్లో ఎంతో యాక్టివ్గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులున్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం'' అని శ్రుతి తెలిపారు.



## 'పబ్లిక్లో అసభ్యంగా..' అందుకే కొట్టేశా..!

దంగల్ సినిమాతో ఫేమ్ తెచ్చుకున్న నటి ఫాతిమా సనా షేక్. అమీర్ ఖాన్ కూతురిగా మెప్పించిన ఫాతిమా బాలీవుడ్లో వరుస సినిమాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం, అనురాగ్ బసు దర్శకత్వం వహించిన మెట్రో ఇన్ డినో చిత్రంలో కనిపించింది. ఈ మూవీలో అలీ ఫజల్ సరసన నటించింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ సక్సెస్ ఎంజాయ్ చేస్తోన్న నటి, తనకెదురైన చేదు అనుభవాన్ని ఇటీవల ఇంటర్వ్యూలో వివరించింది. ఇంతకీ అదేంటో తెలుసుకుందాం.

ఇటీవల ఓ వ్యక్తి తనతో అనుచితంగా ప్రవర్తించాడని తెలిపింది. ఆ సమయంలో అతన్ని తాను కొట్టానని ఫాతిమా వెల్లడించింది. ఐతే, తను కూడా తిరిగి తనను గట్టిగా కింద పడేంతలా కొట్టాడని వివరించింది. దీంతో తాను తీవ్ర నిరాశకు గురయ్యానని తెలిపింది. ఆ ఘటన తర్వాత తాను చాలా జాగ్రత్తగా ఉన్నానని ఫాతిమా సనా షేక్ చెప్పుకొచ్చింది. అటువంటి పరిస్థితులలో ఎలా స్పందించాలో ఇప్పుడు తెలిసొచ్చిందని పేర్కొంది. మనలో ఏదో తప్పు జరుగుతోంది.. దానికి మనం ఎలా స్పందించాలో మాత్రమే ఆలోచించాలని చెబుతోంది ఫాతిమా.

అంతే కాకుండా ముంబైలో ఓ టెంపో డ్రైవర్ నన్ను ఫాలో అయ్యేవాడని ఫాతిమా సనా షేక్ తెలిపింది. కొవిడ్ టైమ్లో ముసుగు ధరించి సైకిల్ తొక్కుతుంటే.. నన్ను చూసిన టెంపో డ్రైవర్ హారన్ మ్రోగించేవాడని.. నేను నా లైన్లో వెళ్తుంటే నా వెంటే వచ్చేవాడని వివరించింది. సెలబ్రిటీ ఐనా.. సామాన్యులైనా ఇటువంటి సంఘటనలు సర్వసాధారణమని తెలిపింది. దీనికి మీరు కేవలం అమ్మాయి అయి ఉంటే చాలన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే ఫాతిమా సనా షేక్ నటించిన 'ఆప్ జైసా కోయి' ఈ రోజే నెట్ఫ్లిక్స్లో విడుదలైంది. ఇందులో ఆర్.మాధవన్ కూడా నటించారు. ఈ చిత్రం ఇద్దరు మధ్య వయస్కుల మధ్య జరిగే ప్రేమ కథగా తెరకెక్కించారు. ఒక స్త్రీ సంప్రదాయ కుటుంబంలో తన ప్రేమ కోసం ఎలా పోరాడుతుందో.. ఈ మూవీలో చూపించనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.